మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 23-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 144 Issue: 144

23 నవంబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:29 సూర్యాస్తమయం - సా. 5:35 తిథిః తదియ రా. 7:23 వరకు తరువాత చవితి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మూల రా. 7:18 వరకు తరువాత పూర్వాషాఢ యోగం ధృతి మ. 12:04 వరకు కరణం గరజి రా. 7:23 వరకు వనిజ ఉ. 8:260 వరకు వర్జ్యం ఉ. 6:01 నుండి ఉ. 7:47 వరకు దుర్ముహూర్తం సా. 4:06 నుండి సా. 4:51 వరకు రాహుకాలం సా. 4:12 నుండి సా. 5:35 వరకు యమగండం మ. 12:02 నుండి మ. 1:25 వరకు గుళికాకాలం మ. 2:49 నుండి సా. 4:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:53 నుండి తె. 5:41 వరకు అమృత ఘడియలు మ. 12:24 నుండి మ. 2:11 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:40 నుండి మ. 12:24 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




# రూపాయికి గోస!

## ఆల్ టైమ్ కనిష్ఠానికి భారత కరెన్సీ.. 89.66 వద్ద ముగిసిన ఫారెక్స్ ట్రేడింగ్

## ఒక్కరోజే 98 పైసల భారీ నష్టం.. త్వరలోనే రూ.90 దాటనున్న డాలర్

భారత కరెన్సీ రూపాయి చారిత్రక కనిష్ఠానికి పడిపోయింది. శుక్రవారం ఫారెక్స్ ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఏకంగా 98 పైసలు నష్టపోయి రూ. 89.66 వద్ద ముగిసింది. రూపాయి విలువ 89 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

న్యూఢిల్లీ: గడిచిన మూడేళ్లలో ఒక్కరోజులో రూపాయి ఇంత భారీగా పతనం కావడం ఇదే మొదటిసారి. 2022 ఫిబ్రవరి 24న రూపాయి 99 పైసలు నష్టపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి విలువ 4.6 శాతం మేర క్షీణించి, తరువాయి 2 వ పేజీలో...



# అమెజాన్ ఉద్యోగాల కోత!

## 1800 మంది ఇంజనీర్ల తొలగింపు

## 40 శాతం టెకీలపై వేటు

ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్.. భారీగా ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. గత నెలలో భారీగా లేఆఫ్స్ ప్రకటించిన అమెజాన్, మరోసారి ఉద్యోగులను తొలగిస్తున్నట్లు తెలిపింది. అమెజాన్‌లోని క్లౌడ్ సర్వీసెస్, డివైజెస్, రిటెయిల్, అడ్వర్టైజింగ్, గ్రాసరీస్ విభాగాల్లోని ఉద్యోగాలు పోతున్నాయి. ఇంజనీర్ల బృందంపై ఈ లేఆఫ్ ప్రభావం తీవ్రంగా ఉంది. 2



## రెండ్రోజుల్లోనే మ్యాచ్ 'బూడిద'!

847 బంతుల్లోనే ముగిసిన యాషెస్ తొలి టెస్ట్

ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ విధ్వంసం

నాలుగో ఇన్నింగ్స్‌లో 69 బంతుల్లోనే సెంచరీ

123 ఏళ్ల రికార్డు బద్ధలు.. ఆస్ట్రేలియా విజయం

(పూర్తి వివరాలు 'క్రీడావాణి' పేజీలో..)

# అప్పు.. ఆడంబరాలు

అప్పుల ఆట..

మెడలో బంగారు గొలుసు..
ఆ మెరుపు బ్యాంకు లోను కాగితానిది!
చేతిలో కొత్త ఐఫోన్..
నిద్ర లేని రాత్రులు.. ఈఎంఐల భయాలు!
గ్యారేజీలో రేంజ్ రోవర్..
ఇంటి తాళం రికవరీ ఏజెంట్ చేతిలో!

సోదరా..

అప్పు అంటే డబ్బు కాదు..
అది భవిష్యత్తును అమ్ముకోవడం!
భవిష్యత్తును అప్పుగా మార్చకు..
చేతిలో ఉన్న డబ్బుతోనే సర్దుకో..!

## పొదుపును పక్కనపెట్టి.. విలాసాలకు పెద్దపీట

## 'లైఫ్ ఈజ్ షార్ట్' అంటూ విచ్చలవిడి ఖర్చు.. ఐఫోన్లు, కార్ల కోసం భవిష్యత్తు తాకట్టు




(ఈవార్తలు - సండే స్టోరీ)

'ప్రాణం ఎప్పుడు పోతుందో తెలియదు.. ఉన్న నాలుగు రోజులు రాజా లాగా బతకాలి!'.. ఇప్పుడు చాలా కుటుంబాల్లో వినిపిస్తున్న కొత్త వేదాంతం ఇది. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించి వెళ్లిన తర్వాత, ప్రజల్లో పొదుపు మంత్రం పెరుగుతుందని ఆర్థిక నిపుణులు భావించారు. కానీ, ఆశ్చర్యకరంగా పరిస్థితి తలకిందులైంది. భయం పోయి, ఆ స్థానంలో 'అవసరానికి మించిన ఆడంబరం' వచ్చి చేరింది. గృహిణులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా చాలా మంది అప్పులు చేసి మరీ విలాసవంతమైన జీవితాన్ని గడపడానికి ఆసక్తి చూపిస్తుండటం ఇప్పుడు సామాజిక తరువాయి 2 వ పేజీలో...

# జీవో వచ్చేసింది!

## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై జీవో విడుదల

## 50 శాతం మించకుండానే విధివిధానాల ఖరారు




రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో 46ను విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు చేసింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయనుంది.

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): పంచాయతీ రాజ్ జీవో 46 ప్రకారం.. మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదు. రిజర్వేషన్ కేటాయింపునకు సోషియో ఎకనామిక్, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, పొలిటికల్ అండ్ క్యాస్ట్ సర్వే 2024 జనాభా డేటా ఆధారంగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఎస్టీ-ఎస్సీ-బీసీ-మహిళా రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు చేయాలి. సర్పంచ్ రిజర్వేషన్‌కు కోసం 2011 జనగణన ం జనాభా డేటా వినియోగించాలి. మునుపటి ఎన్నికల్లో రిజర్వ్ చేసిన వార్డులు/గ్రామాలు అదే కేటగిరీకి మళ్లీ రిజర్వ్ చేయరాదు. వందకు వంద శాతం ఎస్టీ గ్రామాల్లో అన్ని వార్డులు, - 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,584 |
| వెండి (గ్రాము): | రూ.172 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,365 |

# డ్రగ్స్-ఉగ్రవాదంపై పోరాడుదాం

## ప్రపంచ అభివృద్ధి వ్యూహాలను పునఃపరిశీలించాలి

## సమ్మిళిత, స్థిర ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

## జీ20 సమ్మిట్‌లో ప్రధాని మోదీ ప్రతిపాదనలు



2

# అందెశ్రీపైనా కుట్రలు

## ఆయన పాట పదేళ్లు మూగబోయింది

## కవులు, కళాకారులను ఆదుకుంటాం

## అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్

2



## విశ్వవాణి



చెత్తను చెత్తకుండీల్లో వేస్తే తినడానికి ఆహారం అందించే పరికరాలను స్వీడన్‌కు చెందిన ఓ స్టార్టప్ అభివృద్ధి చేసింది. వాటిని స్వీడన్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇది గమనించిన అక్కడి కాకులు.. త్వరగానే ఆ పరికరాలను ఎలా వాడాలో నేర్చుకున్నాయి. రోడ్డు పక్కన పడేసిన సిగరెట్లను తీసుకొచ్చి వాటిల్లో వేయడం ప్రారంభించాయి. దాంతో ఏటా లక్షల సిగరెట్ ముక్కల బాధ తప్పుతోంది. అటు.. కాకులకు కూడా కావాల్సిన ఆహారం దొరుకుతోంది.

# ఇక ఐఏఎస్‌ల వంతు?

## స్థానిక ఎన్నికల వేళ జిల్లాలకు కొత్త కలెక్టర్లు!

## 3-4 కీలక జిల్లాల్లో కలెక్టర్ల మార్పుకు చాన్స్.. వారంలో ప్రక్రియ పూర్తయ్యే చాన్స్: ప్రభుత్వ వర్గాలు




రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పరిపాలన యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే 32 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఐఏఎస్ అధికారుల బదిలీలపై (కలెక్టర్ల బదిలీలు) దృష్టి సారించింది. ఈ మేరకు పలు జిల్లాల కలెక్టర్లను మార్చేందుకు కసరత్తు వేగవంతం చేసినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): ముఖ్యంగా.. మూడు నుంచి నాలుగు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించేందుకు రంగం సిద్ధమైంది. ఈ జాబితాలో రాజన్న సిరిసిల్ల, నిర్మల్, పెద్దపల్లి, రంగారెడ్డి వంటి కీలక జిల్లాలు ఉన్నట్లు తెలుస్తోంది. నూతన ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పరిపాలనలో వేగం, పారదర్శకత కోసం ఈ మార్పులు అవసరమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ల పనితీరు.. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలులో వారి నిబద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. పలు ప్రభుత్వ సమావేశాలు, సమీక్షా సమావేశాలలో అధికారుల పనితీరును మెరుగుపరుచుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచనలు చేస్తూనే తరువాయి 2 వ పేజీలో...



# 37 మంది నక్సల్స్ లొంగుబాటు


## వారిలో ఆజాద్, రమేశ్, సోమ్‌దా తదితరులు

## లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు

## మిగిలిన 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టులు

## మావోయిస్టులంతా ఆయుధాలు అప్పగించారు: డీజీపీ

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై ప్రభుత్వం రూ. 1.41 కోట్ల రివార్డు ప్రకటించింది. లొంగిపోయిన వారికి తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
23.11.2025

మేషం: భాగస్వామ్య వ్యాపారాలు లాభాల బాట పడతాయి. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. దూరప్రాంతాల బంధువులు నుంచి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

వృషభం: బంధువులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు అనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు ఆశించిన విధంగా రాణించి విశేషమైన లాభాలు పొందుతారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాలలో సోదరుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు డబ్బు అందుతుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో ఏర్పడిన అరోధాలను అధిగమిస్తారు. వ్యాపారస్తులకు మాత్రం పెట్టుబడులు అందుతాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. చిన్ననాటి మిత్రులతో కష్టసుఖాలను పంచుకొంటారు.

సింహం: నిరుద్యోగుల ప్రయత్నాలు చాలా కష్టం మీద ఫలిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. మొండి బాకీలు వసూలు అవుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

కన్య: ఉద్యోగాలలో తనకు బాధ్యతల నుండి ఉపశమనం కలుగుతుంది. సంతానం విద్య ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. మిత్రులతో ఏర్పడిన మాటపట్టింపులు తొలగిపోతాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దూరపు బంధువుల మిత్రుల నుండి అందిన సమాచారం కొంత ఆనందం కలిగిస్తుంది.

తుల: ఉద్యోగాలలో ఏర్పడిన చికాకులు అధికారుల సహాయంతో రాజి చేసుకుంటారు. గృహ నిర్మాణ విషయమై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకొంటారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు.

వృశ్చికం: భూ క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు/ వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తొలగుతాయి. బంధువర్గం నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు ఫలిస్తాయి.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో జీతభత్యాల విషయమై శుభవార్తలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.


మకరం: ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు.

కుంభం: నూతన వ్యాపారాలు పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. రుణదాతల నుండి ఒత్తిడి తొలగుతుంది. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకొంటారు.

మీనం: ఉద్యోగాలలో ఎదురైన సమస్యల నుండి తెలివిగా బయటపడతారు. ధనాదాయం మార్గాలు పెరుగుతాయి. స్థిరాస్థి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. చిన్ననాటి మిత్రుల నుంచి కీలక సమాచారం అందుకొంటారు. జీవిత భాగస్వామితో విహార యాత్రలో పాల్గొంటారు.

# డ్రగ్స్‌-ఉగ్రవాదంపై పోరాడుదాం

**ప్రపంచ అభివృద్ధి వ్యూహాలను పునఃపరిశీలించాలి.. సమ్మిళి, స్థిర ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెట్టాలి.. జీ20 సమ్మిట్‌లో ప్రధాని మోదీ ప్రతిపాదనలు**



జోహన్నెస్‌బర్గ్‌: డ్రగ్స్‌, ఉగ్రవాద ఆర్థిక వ్యవస్థలను బలహీనపరచాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన జీ20 సమ్మిట్‌లో భారత ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రపంచ అభివృద్ధి వ్యూహాలను పునఃపరిశీలించాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో సమ్మిళిత, స్థిరమైన వృద్ధిపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అలాగే, ఈ సందర్భంగా ఆయన మూడు కీలక కార్యక్రమాలను ప్రతిపాదించారు. పర్యావరణ సమతుల్యత, సాంస్కృతికంగా సుసంపన్నమైన, సామాజికంగా సమగ్రమైన జీవన విధానాలను పరిరక్షించేందుకు జీ20 కింద గ్లోబల్‌ ట్రెడిషనల్‌ నాలెడ్జ్‌ రిపోజిటరీని ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. 'ఎవరినీ వెనుకబడి ఉంచకుండా సమ్మిళిత, స్థిరమైన ఆర్థిక వృద్ధి' అనే సెషన్‌లో ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ.. 'మన అభివృద్ధి పారామితులను పునఃసమీక్షించడానికి, సమ్మిళిత, స్థిరమైన వృద్ధిపై దృష్టి పెట్టడానికి ఇప్పుడు సరైన సమయం. భారతదేశ నాగరిక విలువలు.. ముఖ్యంగా సమగ్ర మానవతా సూత్రం ముందుకు సాగడానికి ఒక మార్గాన్ని అందిస్తుంది' అని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ముఖ్యంగా ఫెంటానిల్‌ వంటి అత్యంత ప్రమాదకరమైన పదార్థాల వ్యాప్తి అనే సవాలును అధిగమించడానికి... మాదక ద్రవ్య-ఉగ్రవాద సంబంధాన్ని ఎదుర్కోవడానికి జీ20 ఇన్షియేటివ్‌ను భారతదేశం ప్రతిపాదిస్తోందని మోదీ చెప్పారు. 'దౌర్భాగ్యమైన మాదకద్రవ్య-ఉగ్రవాద ఆర్థిక వ్యవస్థను బలహీన పరుద్దాం' అని ఆయన అన్నారు. 'అన్ని విధాలా వృద్ధి చెందాలనే మన కలని సాకారం చేసుకోవడానికి నేను కొన్ని ఆచరణాత్మకమైన అంశాలను ప్రతిపాదించాను. వాటిలో మొదటిది జీ20 గ్లోబల్‌ ట్రెడిషనల్‌ నాలెడ్జ్‌ రిపోజిటరీని సృష్టించడం. భారతదేశానికి ఈ విషయంలో గొప్ప చరిత్ర ఉంది. మంచి ఆరోగ్యం, శ్రేయస్సును మరింత పెంచడానికి ఇది మన సమిష్టి జ్ఞానాన్ని అందించడానికి సహాయపడుతుంది" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో (గతంలో ట్విట్టర్‌) పోస్ట్‌ చేశారు. ఆఫ్రికా అభివృద్ధి ప్రపంచ పురోగతికి చాలా ముఖ్యమని ఆయన అన్నారు. జీ20 ఆఫ్రికా స్కిల్స్‌ మల్టిప్లయర్‌ ఇన్షియేటివ్‌ను ప్రతిపాదించారు. "భారతదేశం ఎల్లప్పుడూ ఆఫ్రికాకు సంఘీభావంగా నిలబడింది. భారతదేశ జీ20 అధ్యక్షత సమయంలోనే ఆఫ్రికన్‌ యూనియన్‌ జీ20లో శాశ్వత సభ్యునిగా మారడం నాకు గర్వకారణం" అని మోదీ పేర్కొన్నారు. రాబోయే దశాబ్దంలో ఆఫ్రికాలో 1 మిలియన్‌ సర్టిఫైడ్‌ శిక్షకులను సృష్టించడం మన సామూహిక లక్ష్యం కావాలని అన్నారు. అలాగే, జీ20 గ్లోబల్‌ హెల్త్‌కేర్‌ రెస్పాన్స్‌ టీమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా ఆయన ప్రతిపాదించారు. "ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో మనం కలిసి పనిచేసినప్పుడు మనం బలంగా ఉంటాము. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన మోహరించడానికి సిద్ధంగా ఉన్న తోటి జీ20 దేశాల నుండి శిక్షణ పొందిన వైద్య నిపుణుల బృందాలను సృష్టించడం మన ప్రయత్నంగా ఉండాలి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# అందెశ్రీపైనా కుట్రలు

**ఆయన పాట పదేళ్లు మూగబోయింది.. కవులు, కళాకారులను ఆదుకుంటాం.. అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం**

రవీంద్రభారతి/హైదరాబాద్‌, నవంబర్‌ 22 (ఈవార్తలు): కొందరు అందెశ్రీపైనా కుట్రలు చేశారని సీఎం రేవంత్‌ అన్నారు. అందెశ్రీ సంస్మరణ సభ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగింది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి హాజరై, అందెశ్రీ సేవలను కొనియాడారు. ఆయనతో పాటు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌ కుమార్‌ గౌడ్‌, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం వంటి ప్రముఖులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం పై తనకున్న అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. తెలంగాణ ప్రజలు అమాయకంగా కనిపిస్తారు కానీ.. అమాయకులు మాత్రం కాదని అన్నారు. ఈ గడ్డ మీద పుట్టిన ఏ ఒక్కరూ ఆధిపత్యాన్ని, అహంకారాన్ని, నిరంకుశ పాలనను సహించరని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర కీలకమని.. చారిత్రకమైనదని సీఎం కొనియాడారు. గద్దరన్న, గూడ అంజన్న, అందెశ్రీ, గోరటి వెంకన్న వంటి కవులు నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ తమ ఆట, పాటలతో ప్రజల్లో ఉద్వేగాన్ని నింపారని గుర్తుచేశారు. "వాళ్లు తీసుకొచ్చిన ఊపుతోనే తెలంగాణ కల సాకారమైంది" అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

'పెన్నుల మీద మన్ను కప్పితే, అవి గన్నులై మొలకెత్తుతాయిబీ మీ గడీలను కుప్పకూలుస్తాయి' అన్న అందెశ్రీ నినాదాన్ని ఉటంకించారు. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన 'జయజయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్రానికి అందించారని, అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని తెలిపారు. తెలంగాణ సాకారమైన తర్వాత.. అందెశ్రీ వంటి కీలక వ్యక్తులను కనుమరుగు చేసే ప్రయత్నం జరిగిందని.. ఆ పాట పదేళ్లుగా మూగబోయి ఉండవచ్చని.. కానీ ప్రజల గుండెల్లో నిత్యం నిలిచిందని సీఎం పరోక్షంగా గత ప్రభుత్వాన్ని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు కోరుకున్న 'జయజయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించామని.. ప్రతి పాఠ్య పుస్తకంలో చేర్చామని గుర్తు చేశారు. తెలంగాణకు రెండు కళ్ల లాంటి వారైన అందెశ్రీ, గద్దరన్న వంటి వారి కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర సేవ చేసిన అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం తన బాధ్యత అని ప్రకటించారు. కవులు, కళాకారులు, దళితులు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో తెలంగాణ ఉద్యమం గురించి ఎక్కడ చర్చ వచ్చినా, అందెశ్రీ పేరు 'కోహినూరు వజ్రంలా' చర్చకు వస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు.

### 37 మంది నక్సల్స్‌ లొంగుబాటు

మొదటి పేజీ తరువాయి

సాంబయ్య అలియాస్‌ ఆజాద్‌, నారాయణ అలియాస్‌ రమేశ్‌, సోమ్‌దా అలియాస్‌ ఎర్ర ఉన్నారని తెలిపారు. మిగిలిన 34 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని ఆయన వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్‌ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు తమ ఆయుధాలను కూడా అప్పగించారని అన్నారు. 37 మందికి తక్షణ సహాయంగా రూ.25 వేల చొప్పున అందజేశామని, ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్‌ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపై రూ.1.41 కోట్ల రివార్డు ఉందని, ఆ మొత్తాన్ని వారికే అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

### ఇక ఐఏఎస్‌ల వంతు?

మొదటి పేజీ తరువాయి

వస్తున్నారు. ఈ క్రమంలో.. ఎన్నికల నిర్వహణకు ముందు సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను జిల్లా కలెక్టర్లుగా నియమించాల్సిన అవసరం ఏర్పడింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. రిజర్వేషన్ల విషయంలో మార్గదర్శకాలను కూడా విడుదల చేయడం జరిగింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో సర్పంచ్‌ ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదల కావడానికి ముందుగానే.. ఎన్నికల విధులను పర్యవేక్షించడానికి వీలుగా.. సమర్థులైన జిల్లా అధికారులను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎన్నికల నిర్వహణలో జిల్లా కలెక్టర్ల పాత్ర అత్యంత కీలకం కాబట్టి, ఈ బదిలీలు కీలకమైనవిగా పరిగణించబడు తున్నాయి. అదనంగా.. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన కొందరు అధికారులపై కొన్ని ఆరోపణలు, పనితీరు లోపాలు ఉన్నట్లుగా ప్రభుత్వానికి నివేదికలు అందాయి. అటువంటి వారిని తప్పించి, నూతన ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పనిచేసే అధికారులకు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ ఐఏఎస్‌ల బదిలీల ద్వారా క్షేత్రస్థాయిలో పరిపాలన వేగం పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## జీవో వచ్చేసింది!

మొదటి పేజీ తరువాయి

సర్పంచ్‌ స్థానాలు ఎస్టీలకు మాత్రమే రిజర్వ్‌ చేయాలి. ఎస్టీ రిజర్వేషన్లను మొదట ఖరారు చేసి, తరువాత ఎస్సీ నుంచి బీసీ కేటాయింపు జరపాలి. మహిళల రిజర్వేషన్‌ అన్ని కేటగిరీలలో ప్రత్యేకంగా లెక్కించి అమలు చేయాలి. గ్రామ పంచాయతీ/వార్డుల సంఖ్య తక్కువైతే.. మొదట మహిళా ప్రాధాన్యత ఆ తరువాత లాటరీ పద్ధతి పాటించాలి. 2019 ఎన్నికల్లో అమలుకాలేని రిజర్వేషన్లు యథాతథంగా కొనసాగవచ్చు. వార్డు రిజర్వేషన్ల నిర్ణయం ఎంపీడీవో, సర్పంచ్‌ రిజర్వేషన్‌ ఆర్డీవోల ఆధ్వర్యంలో జరగాలి. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎలక్షన్‌ అథారిటీలను అమలు చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

## రూపాయికి గోస!

మొదటి పేజీ తరువాయి

ఆసియాలోనే అత్యంత బలహీనపడిన కరెన్సీగా నిలిచింది. దేశీయంగా దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్‌ ఒక్కసారిగా పెరగడం, అంతర్జాతీయంగా డాలర్‌ ఇండెక్స్‌ బలపడటం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. దీనికి తోడు, ఇరాన్‌ నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ఓ భారత కంపెనీపై అమెరికా ఆంక్షలు విధించడం, టెక్నాలజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, విదేశీ పెట్టుబడుల తరలింపు వంటి అంశాలు కూడా ప్రతికూల ప్రభావం చూపాయి. గత నెలలో ఎగుమతులు 11 శాతానికి పైగా తగ్గడం, బంగారం దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు రికార్డు స్థాయికి చేరడం కూడా రూపాయి పతనానికి దోహదపడింది. ఈ నేపథ్యంలో రూపాయి విలువ త్వరలోనే 90 మార్క్‌ను కూడా దాటవచ్చని యా వెల్త్‌ గ్లోబల్‌ రీసెర్చ్‌ డైరెక్టర్‌ అనూజ్‌ గుప్తా అంచనా వేశారు. అమెరికా ఫెడ్‌ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న ఆశలు సన్నగిల్లడంతో డాలర్‌ ఇండెక్స్‌ మరింత బలపడి 102-103 స్థాయికి చేరవచ్చని, ఇది రూపాయిని మరింత బలహీనపరుస్తుందని ఆయన విశ్లేషించారు.




## అమెజాన్‌ ఉద్యోగాల కోత!

**1800 మంది ఇంజనీర్ల తొలగింపు.. 40 శాతం టెకీలపై వేటు**

న్యూయార్క్‌: ప్రముఖ ఈ-కామర్స్‌ సంస్థ అమెజాన్‌.. భారీగా ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. గత నెలలో భారీగా లేఆఫ్స్‌ ప్రకటించిన అమెజాన్‌, మరోసారి ఉద్యోగులను తొలగిస్తున్నట్లు తెలిపింది. అమెజాన్‌లోని క్లౌడ్‌ సర్వీసెస్‌, డివైజెస్‌, రిటెయిల్‌, అడ్వర్టైజింగ్‌, గ్రాసరీస్‌ విభాగాల్లోని ఉద్యోగాలు పోతున్నాయి. ఇంజనీర్ల బృందంపై ఈ లేఆఫ్‌ ప్రభావం తీవ్రంగా ఉంది. అమెరికాలోని న్యూయార్క్‌, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, వాషింగ్టన్‌ రాష్ట్రాల్లోని వర్కర్‌ అడ్జస్ట్‌మెంట్‌ అండ్‌ రీట్రైనింగ్‌ నోటిఫికేషన్‌ ఫైలింగ్స్‌ ప్రకారం.. ఆ రాష్ట్రాల్లో తొలగించిన 4,700 ఉద్యోగాల్లో దాదాపు 40 శాతం ఇంజనీరింగ్‌ రోల్స్‌ కు చెందినవే. ముఖ్యంగా మిడ్‌-లెవల్‌ సాఫ్ట్‌వేర్‌ డెవలప్‌మెంట్‌ ఇంజనీర్లు ఎక్కువగా ప్రభావితమయ్యారు. అయితే ఉద్యోగుల తొలగింపునకు ఏఐ కారణం కాదని సంస్థ తెలిపింది. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌పై భారీ ఎత్తున ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ఉద్యోగులను తొలగిస్తున్నట్లు అమెజాన్‌ తెలిపింది. కొద్ది రోజుల క్రితం అమెజాన్‌ 30 వేల ఉద్యోగులను తొలగించనుందనే ప్రచారం జరిగిన నేపథ్యంలో ఇటీవల అమెజాన్‌ 14000 ఉద్యోగులను తొలగించింది. హ్యూమన్‌ రిసోర్సస్‌(అంతర్గతంగా పిలుచుకునే పీపుల్‌ ఎక్స్‌పీరియన్స్‌ అండ్‌ టెక్నాలజీ లేదా పీఎక్స్‌టీ), ఆపరేషన్స్‌, డివైసెస్‌, సర్వీసెస్‌, అమెజాన్‌ వెబ్‌ సర్వీసెస్‌ విభాగాలలోని ఉద్యోగులపై వేటు పడే అవకాశం ఉంది. అమెరికా, బ్రిటన్‌, కెనడాలోని ఉద్యోగులపై వేటు పడనునుంది. 2020 తరువాత కంపెనీలో ఈస్థాయిలో లేఆఫ్స్‌ జరగడం ఇదే తొలిసారి అని టెక్‌ వర్గాలు చెబుతున్నాయి. తొలగింపులకు సంబంధించి మంగళవారం నుంచి ఈమెయిల్స్‌ ద్వారా సమాచారం తెలియజేస్తారు.

# అప్పు.. ఆడంబరాలు

మొదటి పేజీ తరువాయి

ఆందోళనగా మారుతోంది.

### 'రివెంజ్‌ స్పెండింగ్‌' మోజులో..

కరోనా సమయంలో ఇళ్లకే పరిమితమైన ప్రజలు, ఇప్పుడు ఆ రెండేళ్ల అసహనాన్ని ఖర్చు రూపంలో తీర్చుకుంటున్నారు. దీనినే ఆర్థిక పరిభాషలో 'రివెంజ్‌ స్పెండింగ్‌' అంటారు.

- వారాంతం వస్తే చాలు రెస్టారెంట్లు, పబ్బులు కిటకిటలాడుతున్నాయి.
- అవసరం ఉన్నా లేకపోయినా లక్షల విలువ చేసే హైఎండ్‌ కార్లను కొనుగోలు చేస్తున్నారు.
- ఇంట్లో అందరికీ లేటెస్ట్‌ మోడల్‌ ఐఫోన్లు ఉండటం ఒక 'స్టేటస్‌ సింబల్‌'గా మారిపోయింది.

### ఈఎంఐల ఉచ్చు.. ఆపై అప్పుల కుచ్చు

- ఒకప్పుడు 'అప్పు చేసి పప్పు కూడు' తినడం తప్పు అని భావించేవారు. కానీ ఇప్పుడు 'అప్పు పుట్టడమే గొప్ప' అనే స్థాయికి ఆలోచనలు మారాయి. దీనికి ప్రధాన కారణం సులభంగా లభిస్తున్న ఈఎంఐ సౌకర్యాలు.
- జీరో కాస్ట్‌ ఈఎంఐ మాయ: చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా లక్షల విలువైన వస్తువులను ఇంటికి తెచ్చేస్తున్నారు. క్రెడిట్‌ కార్డుల వాడకం విపరీతంగా పెరిగింది. 'బై నౌ - పే లేటర్‌' యాప్స్‌ యువతను, గృహిణులను ఆకర్షిస్తున్నాయి.
- ఆదాయం రూ.50 వేలు.. ఈఎంఐ రూ.40 వేలు: చాలా కుటుంబాల్లో వచ్చే జీతంలో 80 శాతం ఈఎంఐలకే పోతోంది. ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం మళ్లీ క్రెడిట్‌ కార్డులను ఆశ్రయిస్తున్నారు. ఇది ఒక విషవలయం.

### పక్కింటి వారి కోసమే పరుగు

- సోషల్‌ మీడియా ప్రభావం గృహిణులపై, యువతపై తీవ్రంగా పడింది. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్‌ చేయడం కోసం, వాట్సాప్‌ స్టేటస్‌లలో గొప్పగా చూపించుకోవడం కోసం కొత్త బట్టలు, నగలు, వెకేషన్ల పేరుతో విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు.
- 'పక్కింటి వారు కొత్త కారు కొన్నారు.. మనకు కనీసం చిన్న కారు కూడా లేదా?' అనే సామాజిక ఒత్తిడి అప్పుల వైపు నెడుతోంది.
- పిల్లల పుట్టినరోజు వేడుకలను కూడా లక్షలు ఖర్చు పెట్టి ఈవెంట్‌ మేనేజ్‌మెంట్ల ద్వారా నిర్వహిస్తున్నారు. ఇది కేవలం 'షో పుటప్‌' కోసమే తప్పు, ఆనందం కోసం కాదన్నది చేదు నిజం.

### పొంచి ఉన్న ముప్పు

ఈ విచ్చలవిడితనం వెనుక ఒక పెద్ద ప్రమాదం దాగి ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- ఉద్యోగ భద్రత లేదు: సాఫ్ట్‌వేర్‌ సహా అనేక రంగాల్లో లే ఆఫ్స్‌ భయాలున్నాయి. హఠాత్తుగా ఉద్యోగం పోతే, నెత్తిమీద ఉన్న ఈఎంఐల భారం ఆ కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది.
- అత్యవసర నిధి శూన్యం: వచ్చిన డబ్బంతా విలాసాలకు ఖర్చు పెడితే, రేపు అనారోగ్యం వచ్చినా, అనుకోని ఆపద వచ్చినా ఆదుకునే నాథుడే ఉండడు.
- కుటుంబ కలహాలు: నెల తిరిగేసరికి కట్టాల్సిన డబ్బులు లేక భార్యాభర్తల మధ్య గొడవలు పెరిగి, అవి విడాకుల వరకు వెళ్తున్న సందర్భాలు పెరుగుతున్నాయి.

### ఏం చేయాలి?

- 'ఆనందం వస్తువుల్లో లేదు, ఆర్థిక భద్రతలో ఉంది' అని గ్రహించాల్సిన సమయం ఇది.
- మీ ఆదాయంలో 50 శాతం మించి ఈఎంఐలు ఉండకూడదు.
- అవసరానికి, కోరికకి మధ్య ఉన్న తేడాను గుర్తించాలి.
- సోషల్‌ మీడియాలో ఇతరుల జీవితాలతో మీ జీవితాన్ని పోల్చుకోవడం ఆపేయాలి.

### చివరగా..

గొప్పగా బతకడం తప్పు కాదు. కానీ, ఆ గొప్పతనం అప్పుల పునాదుల మీద ఉంటే అది ఎప్పుడైనా కుప్పకూలిపోవచ్చు. కొవిడ్‌ మనకు నేర్పింది 'జీవితం చిన్నది' అని మాత్రమే కాదు, 'ఆరోగ్యం, పొదుపు ఉంటేనే ఆ జీవితం నిలబడుతుంది' అని కూడా. ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే, భవిష్యత్తు అంధకారమే.

# ఒకే వేదికపై జగన్ కేటీఆర్

**బెంగళూరులో ప్రైవేటు ఫంక్షన్‌లో పక్కపక్కనే .. ఇద్దరు కలిసే ఫంక్షన్ హాలులోకి ఎంట్రీ**



బెంగళూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకే వేదికపై కలుసుకున్నారు. శుక్రవారం సాయంత్రం బెంగళూరులోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో వీరిద్దరు పాల్గొన్నారు. పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించారు. కేటీఆర్ ఏదో చెబుతుండగా జగన్ వేడుకను తిలకిస్తూ విన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వారిద్దరు కలిసి బయటి నుంచి ఫంక్షన్ హాలులోకి వస్తున్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి తొమ్మిదిన్నరేళ్లు బీఆర్ఎస్ అధికారంలో కొనసాగింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి టర్మ్ తెలుగుదేశం, రెండో టర్మ్ వైసీపీ ప్రభుత్వాలు పాలించాయి. ఈ క్రమంలో 2019 నుంచి ఏపీలోని వైసీపీ ప్రభుత్వం, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్య సత్సంబంధాలు కొనసాగాయానే ప్రచారం జరిగింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ ఓటమి పాలయ్యాయి. ఇటీవల కేసీఆర్ పై, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై జగన్ సానుకూల వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు ఒక వేడుకలో కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# తెలియదు.. గుర్తులేదు

**విచారణలో ఐ-బొమ్మ రవి జవాబులు**




హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): ఐ-బొమ్మ నిర్వాహకుడు రవి మూడో రోజు విచారణ ముగిసింది. రవిని నాంపల్లి కోర్టు ఐదు రోజుల కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు అతడిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. మూడో రోజు విచారణలో భాగంగా రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై ఆరా తీశారు. మన దేశంతో పాటు విదేశాల్లో ఉన్న లింకులు, ఆస్తులపై కూడా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఎవరెవరు సహకరిస్తున్నారు, ఈ వ్యవహారంలో రవి వెనుక ఎంతమంది ఉన్నారనే విషయాలపై ప్రశ్నించారని సమాచారం. అయితే.. రవి తనకు తెలియదు, గుర్తులేదు అన్న జవాబులే ఇచ్చినట్లు సమాచారం. సైబర్ నేరాలకు ఐ-బొమ్మ వెబ్‌సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా విడుదలైన సినిమాలను సేకరించే విధానం, ఐ-బొమ్మ సహా మిర్రర్ సైట్‌లలోకి అప్‌లోడ్ చేసే విధానంపై పోలీసులు సమాచారం రాబట్టే ప్రయత్నం చేశారు.

# నియోజకవర్గ అభివృద్ధికే కాంగ్రెస్‌తో: కడియం

స్టేషన్, ఘన్‌పూర్ 22 (ఈవార్తలు): స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ నెల 23వ తేదీలోపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సభాపతి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, తనకు నోటీసులు అందాయని తెలిపారు. అయితే, వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని సభాపతిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. సభాపతి ఇచ్చిన గడువులోగా వివరణ ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. సభాపతి తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికార పార్టీతో కలిసి పనిచేస్తున్నందునే స్టేషన్ ఘనపూర్‌కు పెద్ద ఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన వెల్లడించారు. తాను ఎవరికీ భయపడని వ్యక్తినని అన్నారు.

# 4,740.. 9,298 ఎకరాలు

**దుద్దిళ్లా.. బహిరంగ చర్చకు సిద్ధమా?.. మాజీమంత్రి హరీశ్ రావు సవాల్**



హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): రేవంత్ రెడ్డి రూ.5 లక్షల కోట్ల విలువైన 9,298 ఎకరాల భూమిని రూ.4,500 కోట్లకు విక్రయించాలని చూస్తున్నారని, దీని ద్వారా రూ.4 లక్షల 95 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. విక్రయానికి పెట్టిన భూమి 4,740 ఎకరాలు మాత్రమేనని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని, కానీ వాస్తవానికి ఆ భూమి 9,298 ఎకరాలుగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రికి సవాల్ విసిరారు. పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఆజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు అధికంగా వసూలు చేయాలని చట్టం చేశామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే భూములను అప్పగించాలని చూస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5 లక్షల కోట్లు రావాల్సిన భూములకు రూ.5 వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయని ప్రశ్నించారు. రెండు సంవత్సరాల బడ్జెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని అన్నారు. మంత్రి మండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఇలాంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారని నిలదీశారు. ఈ భూములను వేలం వేస్తే రూ.5 లక్షల కోట్లు వస్తాయని ఆయన అన్నారు. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తారని నిలదీశారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు పంపించాలని నిర్ణయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా పంపిస్తోందని ఆరోపించారు. పరిశ్రమలకు ఇచ్చిన భూములను బహుళ అవసరాలకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ వల్లే హామీలు ఆలస్యం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేసిన మితిమీరిన అప్పుల కారణంగానే ప్రస్తుతం తాము ఇచ్చిన హామీల అమలులో కొంత జాప్యం జరుగుతోందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు అవుతున్న ఖర్చు కంటే కేసీఆర్ చేసిన అప్పులకు చెల్లిస్తున్న వడ్డీనే ఎక్కువగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్యమంత్రులందరూ చేసిన అప్పుల కంటే పది రెట్లు అధికంగా కేసీఆర్ అప్పులు చేశారని ఆరోపించారు. తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మహిళలకు పంపిణీ చేస్తున్న చీరలు గతంలో ఇందిరాగాంధీ కట్టిన చీరల్లాగే ఉన్నాయని ఆయన అన్నారు. నాణ్యతలో రాజీపడకుండా ప్రభుత్వం చీరలను తయారు చేయించిందని తెలిపారు. మహిళా సంఘాల్లోని మహిళలకు కూడా చీరలు అందుతాయని ఆయన చెప్పారు. కొల్లాపూర్‌లో సరైన రోడ్లు కూడా లేవని గతంలో చంద్రబాబు హేళన చేశారని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కిరణ్ కుమార్ రెడ్డిని అభ్యర్థించి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించానని ఆయన గుర్తు చేశారు.

# రాజీనామా యోచనలో దానం, కడియం?





హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం కీలక మలుపు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి తమపై అనర్హత వేటు పడకుండా ముందే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చించేందుకే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కేటీఆర్ సహా పలువురు నేతలు స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ ఈ పిటిషన్లపై విచారణ వేగవంతం చేశారు. ఈ నెల 23లోగా వివరణ ఇవ్వాలంటూ స్పీకర్ గురువారం దానం, కడియంలకు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు అందుకున్న రోజే దానం నాగేందర్ ఢిల్లీకి పయనం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడంతో దానం పార్టీ మారినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి. దీంతో విచారణ కొనసాగితే అనర్హత వేటు తప్పదని భావిస్తున్న ఆయన, అంతకంటే ముందే రాజీనామా చేయడమే మేలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీనికి బదులుగా తనకు రాజ్యసభ సీటు లేదా ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రివర్గంలోకి తీసుకోవాలని, లేదంటే ఖైరతాబాద్ ఉపఎన్నికలో మళ్లీ తనకే టికెట్ ఇచ్చి, గెలిచాక మంత్రి పదవి ఇవ్వాలనే పలు ప్రతిపాదనలను అధిష్ఠానం ముందు ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, కడియం శ్రీహరి పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తన కుమార్తె కావ్యకు ఆయన బహిరంగంగా మద్దతు పలకడం, నామినేషన్ పత్రాలపై సంతకం చేయడం వంటివి ఆయనకు ప్రతికూలంగా మారాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం స్పీకర్‌ను కలిసిన కడియం శ్రీహరి.. వివరణ ఇచ్చేందుకు మరికొంత గడువు కావాలని కోరారు. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే దానం రాజీనామా చేస్తారని, కడియం కూడా అదే దారిలో నడిచే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# ఐబొమ్మ రవి దమ్మున్నోడు

దమ్ముంటే సైబర్ నేరాలు ఆపండి: తీన్మార్ మల్లన్న

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్ట్ వ్యవహారం అనూహ్యంగా రాజకీయ మలుపు తీసుకుంది. ఈ అరెస్టుపై కాంగ్రెస్ బహిష్కృత నేత తీన్మార్ మల్లన్న చేసిన సంచలన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన తీవ్ర ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐబొమ్మ రవి దమ్మున్నవాడని, అందుకే అతనికి ప్రజల మద్దతు ఉందని తీన్మార్ మల్లన్న అన్నారు. "వంద రూపాయల టికెట్‌ను వేలల్లో అమ్ముకునే సినిమా వాళ్లు ఏమైనా సంసారులా?" అని ప్రశ్నించారు. సినిమా ప్రముఖులతో కలిసి సజ్జనార్ మీడియా సమావేశం నిర్వహించడంపై మండిపడ్డారు. రవి భార్య సమాచారం ఇవ్వకుంటే పోలీసులు అతడిని పట్టుకునేవారే కాదని, సినిమా డైలాగులు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. సజ్జనార్ చేసేవన్నీ ఫేక్ ఎన్‌కౌంటర్లేనని, వరంగల్‌లో చేసింది కూడా అదేనని మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. "నీకు దమ్ముంటే దేశంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లు, కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలను ఆపి చూపించు" అంటూ సవాల్ విసిరారు. గతంలో సీవీ ఆనంద్ కూడా ఇలాంటి సైబర్ మోసాలు ఆగవని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. గత కొంతకాలంగా సినీ పరిశ్రమకు తలనొప్పిగా మారిన ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్టుతో ఇండస్ట్రీ వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి. అయితే అధిక టికెట్ ధరల కారణంగా థియేటర్లకు వెళ్లలేని సామాన్యులు మాత్రం రవికి మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే మల్లన్న వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు.

# ఓవర్ లోడ్‌తో వెళ్తే వెహికల్ సీజ్

**రెండోసారి దొరికితే కఠిన చర్యలు**

**నిబంధనలను కఠినతరం చేసిన రవాణా శాఖ**

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రవాణా శాఖ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న పలు నిబంధనలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు కొన్ని కొత్త రూల్స్ ను అమలు చేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఓవర్ లోడ్ తో వెళ్లే వాహనాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఓవర్ లోడ్ తో వెళుతూ పట్టుబడిన వాహనాలకు మొదటిసారి భారీగా ఫైన్ విధించడం, రెండోసారి కూడా పట్టుబడితే అక్కడికక్కడే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు డ్రైవర్ లైసెన్స్ ను రద్దు చేయనున్నట్లు తెలిపింది. ఇటీవల వరుస ప్రమాదాలు, భారీగా ప్రాణనష్టం జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల 33 జిల్లాల స్థాయిలో బృందాలను, మూడు రాష్ట్ర స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను రవాణా శాఖ ఏర్పాటు చేసింది. డీటీసీ, ఆర్టీఏ అధికారులతో వాహనాల తనిఖీలను పకడ్బందీగా నిర్వహించింది. తనిఖీలకు వెళ్లే బృందాలకు చివరి నిమిషంలో సమాచారం ఇవ్వడం ద్వారా అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ఆయా బృందాలకు సమాచారం అందించి 10 రోజులుగా తనిఖీలు నిర్వహించింది. ఇందులో రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను గుర్తించి ఆర్టీఏ అధికారులు 4,748 కేసులు నమోదు చేశారు. మొత్తం 3,420 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఓవర్ లోడ్ తో దూసుకువెళ్లే వాహనాల కారణంగానే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాటిపై దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఓవర్ లోడ్ తో వెళ్లే వాహనాలను ఆపి భారీ మొత్తంలో జరిమానా విధించాలని సూచించారు. రెండోసారి ఓవర్ లోడ్ తో వాహనం పట్టుబడితే ఆ వాహనాన్ని సీజ్ చేసి పర్మిట్ ను రద్దు చేయాలని ఆదేశించారు. డ్రైవర్ లైసెన్స్ కూడా రద్దు చేసేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

# ఫార్ములా-ఈతో బీఆర్ఎస్‌కు 44 కోట్లు

**రేసింగ్ అంశంలో క్విడ్ ప్రో కో: ఏసీబీ**



హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఫార్ములా ఈ రేస్ లో భారీగా అవినీతి జరిగిందని ఏసీబీ నివేదిక తేల్చింది. ఈ రేస్ నిర్వహించాలన్నది అప్పటి మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సొంత నిర్ణయమేనని వెల్లడించింది. రేస్ నిర్వహణలో క్విడ్ ప్రో కో జరిగిందని, ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీ ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో బీఆర్ఎస్ పార్టీకి రూ.44 కోట్లు ముట్టజెప్పిందని సెప్టెంబర్ 9న ప్రభుత్వానికి సమర్పించిన తుది నివేదికలో ఏసీబీ పేర్కొంది. ఈ అక్రమ వ్యవహారంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అరవింద్ కుమార్, ఏ3 గా బిఎల్ఎన్ రెడ్డి, ఏ4గా, ఏ5లుగా ఎఫ్ఈవో ప్రతినిధులను చేర్చింది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ప్రైవేట్ డిస్కషన్లతో రేస్ నిర్వహించారని ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ రేస్ ప్రమోటర్ గా వ్యవహరించిన ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీ ట్రైపార్టీ అగ్రిమెంట్ కు ముందే.. అంటే 2022 ఏప్రిల్, అక్టోబర్ నెలలో బీఆర్ఎస్ పార్టీకి రూ.44 కోట్లు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో విరాళం ఇచ్చిందని తెలిపింది. ఆ తర్వాతే ఈ కంపెనీకి ఈ రేస్ ప్రమోటర్ గా ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొంది. గవర్నర్ సంతకం లేకుండా, ఆర్థిక శాఖ ముందస్తు అనుమతి లేకుండానే అప్పటి ఐఏఎస్ అరవింద్ కుమార్ ఈ రేస్ కాంట్రాక్టులకు ఆమోదముద్ర వేశారని ఏసీబీ విచారణలో వెల్లడైంది. 2023 అక్టోబర్ 9 నుండి డిసెంబర్ 4 వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని గుర్తు చేస్తూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో రూ.10 కోట్ల కంటే ఎక్కువ నిధులు చెల్లించాల్సి వస్తే ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని ఏసీబీ పేర్కొంది. అయితే, ఈ రేస్ నిర్వహణకు సంబంధించి ఈ నిబంధనను పాటించలేదని, అప్పటి సీఎస్ తో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ కు కూడా ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఏసీబీ తన నివేదికలో వెల్లడించింది.

# ఇసుక మాఫియా.. చెక్ డ్యామ్‌నే కూల్చేశారు!

పెద్దపల్లి, నవంబర్ 22 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లాలో ఇసుక మాఫియా బరితెగించింది. అక్రమ రవాణాకు అడ్డుగా ఉందని భావించి, ఏకంగా ఓ చెక్ డ్యామ్‌నే కూల్చివేసింది. ఓదెల మండలం గుంపుల గ్రామం వద్ద మానేరు వాగుపై ఇటీవలే నిర్మించిన ఈ చెక్ డ్యామ్‌ను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన నిన్న రాత్రి జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఈ ఉదయం ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దుండగుల దాడిలో చెక్ డ్యామ్‌కు చెందిన మూడు ప్యానళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని గుర్తించారు. దీంతో డ్యామ్‌లో నిల్వ ఉన్న నీరంతా వృథాగా దిగువకు ప్రవహిస్తోంది.

# ఖైరతాబాద్‌లో మొదలైన ఉప ఎన్నిక ప్రచారం

**రప్పారప్పా అంటూ బీఆర్ఎస్ పోస్టర్**

ఖైరతాబాద్/హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంపై పడింది. ఇక్కడ త్వరలో ఉప ఎన్నిక వస్తుందన్న ప్రచారంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార కాంగ్రెస్‌లో ఆశావహులు అప్పుడే ప్రచారం మొదలుపెట్టగా, బీఆర్ఎస్ కూడా తాము సిద్ధమంటూ సోషల్ మీడియా వేదికగా సంకేతాలు పంపుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం నాగేందర్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీంకోర్టు కఠినంగా వ్యవహరిస్తుండటంతో, దానం నాగేందర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయక తప్పదనే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఖైరతాబాద్‌లో రాజకీయ సందడి నెలకొంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మాజీ కార్పొరేటర్ రాజు యాదవ్, ఉప ఎన్నికలో టికెట్ తనకే కేటాయించాలని కోరుతూ ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వద్ద, ఇతర కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మరికొందరు నేతలు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ కూడా ఉప ఎన్నికకు సై అంటోంది. 'రప్పా రప్పా' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతోంది. ఎన్నిక ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తోంది. దీంతో అధికారిక ప్రకటన రాకముందే ఖైరతాబాద్ నియోజకవర్గంలో రాజకీయ వేడి ఊపందుకుంది.

# మూడు రోజులపాటు వర్షాలు



హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ సహా తెలంగాణలోని తూర్పు జిల్లాల్లో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే, రాష్ట్రంలో చలిగాలుల ప్రభావం అంతగా ఉండకపోవచ్చని ప్రాథమికంగా తెలిపింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం కారణంగా అండమాన్ నికోబార్ దీవులకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. నవంబర్ 24, 25 తేదీల్లో అక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, నవంబర్ 23 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. పోర్ట్ బ్లెయిర్ పోర్టులో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలల ఉధృతి కారణంగా పర్యాటకులు, బోట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, తెలంగాణ వాతావరణంపై తన అంచనాలతో గుర్తింపు పొందిన 'తెలంగాణ వెదర్‌మ్యాన్' రెండు రకాల అంచనాలను వివరించారు. ఈ వ్యవస్థ ప్రభావంతో ఉత్తర, మధ్య ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని తూర్పు జిల్లాలు, హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఒకవేళ ఈ పరిస్థితి ఏర్పడటం ఆలస్యమైతే, అది పెను తుపానుగా మారే ప్రమాదం ఉందని, అప్పుడు తెలంగాణలో పొడి వాతావరణంతో పాటు తీవ్రమైన చలిగాలులు వీస్తాయని అంచనా వేశారు.

# చదువుతోనే సమాజంలో మార్పు

## హైదరాబాద్ కలెక్టర్ హరిచందన... రెడ్డి కాలేజీ స్నాతకోత్సవానికి హాజరు

నారాయణగూడ/హైదరాబాద్, నవంబర్ 22: చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఆ దిశగా విద్యార్థులు ముందుకు వెళ్ళాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి సూచించారు. నారాయణగూడ లోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన 14వ స్నాతకోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న రాజా బహదూర్ వెంకటరామారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల అడిటోరియంలో ఏర్పాటు చేసిన స్నాతకోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్తు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర అధ్యయనం



ముఖ్యమని చెప్పారు. భవిష్యత్ అంతా యువతరానిదే అని అన్నారు. కళాశాల చదువు ముగిసిన వెంటనే ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, ఉన్నత విద్య వంటి ఎన్నో మార్గాలు ఉన్నాయని, వాటిలో ఏదైనా ఒక్క దానిని ఎంచుకుని దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రజంటేషన్స్ మెరుగుపరుచుకోవాలని, ఇవి ఉద్యోగ విపణిలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం జీవితాంతం విద్యార్థులకు బలమని, సమాజం కోసం సేవాభావంతో పనిచేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర సింగ్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జె. అచ్యుతదేవి, హైదరాబాద్ మహిళా విద్యా సంఘం కార్యాదర్శి ప్రొఫెసర్ కట్టా ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి. సుదర్శన్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి. వాణి మాధవి, వైస్ ప్రిన్సిపల్ కె. సింధూరి, కన్వీనర్ డాక్టర్ ఎం.సుచిత్ర, కో కన్వీనర్ డాక్టర్ కె. స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌కు మేడిపెల్లి సత్యం

## పెద్దపెల్లికి రాజ్ ఠాకూర్.. 30 జిల్లాలకు డీసీసీ అధ్యక్షుల ప్రకటన



హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలు , మూడు ప్రధాన కార్పొరేషన్లతో సహా మొత్తం 36 మంది డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) అధ్యక్షులను ప్రకటించింది. ఈ నియామకాల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేయాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. నూతనంగా ప్రకటించిన ఈ డీసీసీ అధ్యక్షుల జాబితాలో బహుజన వర్గాలు (బీసీ), దళిత (ఎస్సీ), గిరిజన (ఎస్టీ), మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులకు సగానికి పైగా అధ్యక్ష స్థానాలు కేటాయించారు. ఈ నిర్ణయం ద్వారా.. రాష్ట్రంలో తమ సామాజిక పునాదిని మరింత బలోపేతం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తోంది. పార్టీ సిద్ధాంతమైన అందరినీ కలుపుకొని పోయే విధానానికి ఇది నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ కీలక నియామకాల్లో.. మహానగర పాలక సంస్థల పరిధిలో కూడా ప్రత్యేక అధ్యక్షులను నియమించడం ద్వారా పట్టణ ప్రాంతాలపై పార్టీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఖలీఫ్ సైదుల్లా, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా దీపక్ జాన్ వంటి ప్రముఖులను నియమించారు. అలాగే.. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లకు కూడా ప్రత్యేక అధ్యక్షులను నియమించడం జరిగింది. ఈ నూతన సారథుల ద్వారా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి అనుకూల వాతావరణాన్ని సృష్టించవచ్చని కాంగ్రెస్ నాయకత్వం విశ్వసిస్తోంది. ఈ నియామకాల్లో ఆదిలాబాద్- నరేష్ జాదవ్, అసిఫాబాద్- ఆత్రం సుగుణ, భద్రాద్రి కొత్తగూడెం - తోట దేవీ ప్రసన్న, భువనగిరి - బీర్ల అయిలయ్య, గద్వాల - ఎం. రాజీవ్ రెడ్డి, హన్మకొండ - వెంకటరాం రెడ్డి, హైదరాబాద్ - ఖలీఫ్ సైదుల్లా, జగిత్యాల - నందయ్య, జనగాం - లఖావత్ ధనావతి, భూపాలపల్లి - కరుణాకర్, కామారెడ్డి - మల్లిఖార్జున్, కరీంనగర్ - మేడిపల్లి సత్యం, కరీంనగర్ కార్పొరేషన్ - వీ. అంజన్ కుమార్, ఖైరతాబాద్ - రోహిత్ ముదిరాజ్, ఖమ్మం - నూతి సత్యనారాయణ, ఖమ్మం కార్పొరేషన్ - దీపక్ చౌదరి, మహబూబాబాద్ - భూక్య ఉమా, మహబూబ్‌నగర్ - సంజీవ్ ముదిరాజ్, మంచిర్యాల - రఘునాథ్ రెడ్డి, మెదక్ - శివన్నగిరి ఆంజనేయులు గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి - తోటకూర వజ్రేష్ యాదవ్, ములుగు - పైడాకుల అశోక్, నాగర్ కర్నూలు - డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నల్గొండ - కైలాశ్ నేత, నారాయణ్‌పేట్ - కొల్లుకుదురు ప్రశాంత్ రెడ్డి, నిర్మల్ - వెడ్మ బొజ్జు, నిజామాబాద్ - నగేశ్ రెడ్డి, నిజామాబాద్ కార్పొరేషన్ - బొబ్బిలి రామకృష్ణ, పెద్దపల్లి - ఎంఎస్ రాజ్ ఠాకూర్, రాజన్న సిరిసిల్ల - సంగీతం శ్రీనివాస్, సికింద్రాబాద్ - దీపక్ జాన్, సిద్దిపేట్ - ఆంక్షా రెడ్డి, సూర్యాపేట్ - గుడిపాటి నర్సయ్య, వికారాబాద్ - ధారాసింగ్ జాదవ్, వనపర్తి - శివసేనా రెడ్డి, వరంగల్ - మహ్మద్ అయ్యూబ్ ఉన్నారు.

## చంద్రబాబుకు నోటీసు.. సీఐ శంకరయ్య డిస్మిస్!

పులివెందుల, నవంబర్ 22 (ఈవార్తలు): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి పులివెందుల సీఐ శంకరయ్యపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కేసు దర్యాప్తు సక్రమంగా చేయకపోవడం వంటి కారణాలతో ఆయన్ను సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగిస్తూ (డిస్మిస్) కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే లీగల్ నోటీసులు పంపి శంకరయ్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. వివేకా హత్య జరిగినప్పుడు ఘటనాస్థలిలో సాక్ష్యాలను చెరిపివేస్తున్నా సీఐగా శంకరయ్య అడ్డుకోలేదని చంద్రబాబు పలు సందర్భాల్లో విమర్శించారు. ఈ వ్యాఖ్యలు తన పరువుకు నష్టం కలిగించాయని పేర్కొంటూ శంకరయ్య సీఎంకు నోటీసులు పంపారు. 2019 మార్చి 15న వివేకా హత్య జరిగినప్పుడు శంకరయ్య పులివెందుల సీఐగా ఉన్నారు. హత్యాస్థలిలో రక్తపు మరకలను శుభ్రం చేస్తున్నా ఆయన వారించలేదని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును దర్యాప్తు చేపట్టిన సీబీఐకి ఆయన మొదట కీలక వాంగ్మూలం ఇచ్చారు. కడప ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన అనుచరులు తనను బెదిరించారని, కేసు నమోదు చేయవద్దని ఒత్తిడి చేశారని తెలిపారు. అయితే, మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు మాత్రం నిరాకరించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే నాటి జగన్ ప్రభుత్వం ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శంకరయ్యపై వచ్చిన ఆరోపణల విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వేకెంట్ రిజర్వ్ (వీఆర్)లో ఉన్న ఆయన, విచారణకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

## నిరాడంబరంగా ఐఏఎస్‌ల పెళ్లి

వైజాగ్, నవంబర్ 22 (ఈవార్తలు): ఆర్భాటాలు, అట్టహాసాలకు దూరంగా ఇద్దరు యువ ఐఏఎస్ అధికారులు ఎంతో నిరాడంబరంగా వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న టి.శ్రీ పూజ, మేఘాలయలో దాదెంగ్రి జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆదిత్యవర్మ శుక్రవారం విశాఖపట్నంలో ఒక్కటయ్యారు. విశాఖలోని కైలాసగిరిపై ఉన్న శివాలయంలో ఇరువురూ దండలు మార్చుకుని వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ కార్యక్రమానికి కేవలం ఇరు కుటుంబ సభ్యులు మాత్రమే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వీరిద్దరూ నేరుగా వన్‌టౌన్‌లోని జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సంతకాలు చేసి తమ వివాహాన్ని చట్టబద్ధంగా నమోదు చేసుకున్నారు. విశాఖపట్నం డీఐజీ బాలకృష్ణ దగ్గరుండి ఈ వివాహ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు.

# ఇందిరమ్మ బాటలో మహిళా సంక్షేమం

## మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట.. మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

నాగర్ కర్నూల్ నవంబర్ 22 (ఈ వార్తలు): ఇందిరమ్మ బాటలో ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ అన్ని రంగాలలో మహిళలకు ప్రోత్సహిస్తూ మహిళా సాధికారకతకు ప్రభుత్వం పెద్దపీట వేసుకున్నదని అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం నాగర్ కర్నూలు జిల్లా లింగాల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలనలోని ప్రభుత్వ పథకాల్లో మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తోందని అన్నారు.రాష్ట్రంలో కోటి చీరల పంపిణీ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి రోజున మహిళలకు చీరల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళల ఆత్మగౌరవానికి పెంచడానికి ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఇందిరమ్మ చీరలను సిరిసిల్ల నేత కార్మికుల చేత తయారు చేయిస్తున్నామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నాదని అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీల పథకంలో మహిళలకు ప్రాధాన్యమిచ్చామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో మహిళలను భాగస్వాములను చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. మహిళల



పేరుతోనే ఇళ్ల నిర్మాణం చేపట్టిందని గుర్తు చేశారు. మహిళలను కోటీశ్వరులుగా ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా పని చేస్తున్నదని అన్నారు.గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ఫ్ ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా మహిళా సంఘాలు లాభపడాలనే ఆకాంక్షతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. వడ్డీలేని రుణాలతో పాటు బ్యాంక్ లింకేజీ, ప్రమాద బీమా, రుణ బీమా వంటి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం నుంచి మహిళలకు పెట్రోల్ బంక్లు, ఎలక్ట్రిక్ బస్సులు అందిస్తూ ఆర్థిక బలోపేతానికి కృషి చేసిందన్నారు. అన్ని రంగాలలో మహిళలు రాణించే విధంగా ప్రభుత్వం ఇస్తున్న చేయూతను సద్వినియోగపరచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి మహిళా ఒక ఇందిరాగాంధీలా శక్తివంతమైన మహిళగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్ డిఓ రాజేశ్వరి, తాసిల్దార్ పాండు, మాజీ సింగిల్ సింగిల్ విండో అధ్యక్షులు రంగినేని శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రాథోడ్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి చెన్నయ్య, ఏపిఎం విజయ, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరమ్మ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నందిని తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డి



జగిత్యాల, నవంబర్ 22 (ఈవార్తలు): జగిత్యాల ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. వరంగల్ రేంజ్‌లో వేములవాడ ఏఎస్పీగా పనిచేసిన ఆమెను ఖాళీగా ఉన్న జగిత్యాల అదనపు ఎస్పీ (పరిపాలన)గా ప్రభుత్వం బదిలీ చేసింది. నల్లగొండ జిల్లా లింగారెడ్డిగూడేనికి చెందిన శేషాద్రిని రెడ్డి ఐఐటీ హైదరాబాద్ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసి, 2020లో మొదటి ప్రయత్నంలోనే 401 ర్యాంక్‌తో ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యారు.




## ఆరెస్సెస్ జనజాగరణ అభియాన్ ప్రారంభం

వేములవాడ, నవంబర్ 22 (ఈవార్తలు): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని వేములవాడ పట్టణంలో ఆర్‌ఎస్ఎస్ జనజాగరణ అభియాన్ శనివారం ప్రారంభించారు. పట్టణంలోని మార్కండేయనగర్ కాలనీలో ఉన్న అంబా భవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వయం సేవకులు.. ఇంటింటికీ వెళ్లి జనజాగరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘ్ సిద్ధాంతాలు, సేవా కార్యక్రమాలు, సమాజ నిర్మాణంలో సంస్థ పోషిస్తున్నటువంటి పాత్రను సేవకులు ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ కుటుంబ విలువలు దేశభక్తి గురించి, సంఘ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సహ కార్యవగ్ కోపల్ల రాజన్న, కోనం పుల్లరెడ్డి, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రంగుమారినా పత్తి కొనాలి

**అరటి రైతులను ఆదుకునేందుకు ముంబైకి రైల్వే వ్యాగన్లు**

**ఏపీ సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**



అమరావతి, నవంబర్ 22 (ఈవార్తలు): ఏపీలో అరటి, పత్తి, మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. ధరల పతనం, కొనుగోళ్లలో జాప్యం వంటి అంశాలపై ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి, రైతులను ఆదుకునేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రాయలసీమ అరటి రైతులు, రాష్ట్రవ్యాప్తంగా పత్తి, మొక్కజొన్న రైతులు నష్టపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాయలసీమలో సుమారు 40 వేల హెక్టార్లలో పండుతున్న అరటికి సరైన ధర లభించకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధరలు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పగా, అప్పటివరకు రైతులను నష్టపోనివ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమ అరటిని ముంబై, కలకత్తా వంటి ప్రధాన మార్కెట్లకు రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించేందుకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చిందని అధికారులు తెలపగా, రవాణాకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అరటి ధరలు, కొనుగోళ్లపై వ్యాపారులతో ప్రతిరోజూ సమావేశాలు నిర్వహించి, మార్కెట్‌ను నిరంతరం పర్యవేక్షించాలని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి మొక్కజొన్న రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ధరల వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈసారి 8.18 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేయగా, మార్క్‌ఫెడ్ ద్వారా 2.04 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయోగాత్మకంగా ఇతర ఏజెన్సీలతో కొనుగోళ్లు చేపట్టాలని పేర్కొన్నారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రానున్న వర్షాల దృష్ట్యా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రంగుమారిన, తడిచిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలైన తేమ శాతం వంటి కారణాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సీఎం సూచనలతో స్లాట్ బుకింగ్ సమస్య పరిష్కారమైందని అధికారులు వివరించారు. కొనుగోలు కేంద్రాలను ప్రతిరోజూ తనిఖీ చేస్తూ, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.



## పుట్టపర్తికి రాష్ట్రపతి

**ఘనస్వాగతం పలికిన సీఎం చంద్రబాబు**

పుట్టపర్తి, నవంబర్ 22 (ఈవార్తలు): పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం పుట్టపర్తికి విచ్చేశారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ఆమెకు సీఎం చంద్రబాబు.. ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ప్రశాంతి నిలయంలో జరిగిన సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సీఎం, మంత్రి లోకేశ్ పుట్టపర్తి చేరుకోగా, వారికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. కాగా, సాయంత్రం జరగనున్న శ్రీ సత్యసాయి యూనివర్సిటీ 44వ స్నాతకోత్సవానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవంలోనూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాల్గొంటారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి పర్యటనలతో పుట్టపర్తిలో సందడి వాతావరణం నెలకొంది.

## పోలీస్ కస్టడీకి భాస్కర్ రెడ్డి

విజయవాడ, నవంబర్ 22 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన మహిళలపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత, ఎన్నారై మాలపాటి భాస్కర్ రెడ్డిని రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ కేసులో మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని ప్రశ్నించనున్నారు. లండన్‌లో నివాసముంటున్న భాస్కర్ రెడ్డి, గత మూడేళ్లుగా సోషల్ మీడియా వేదికగా వివాదాస్పద పోస్టులు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరంకు చెందిన ఆయన, ఇటీవల తండ్రి మరణించడంతో స్వగ్రామానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో ఆయనను ఈ నెల 21 వరకు రిమాండ్‌కు తరలించగా, ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైలులో ఖైదీగా ఉన్నారు.

## ఏపీలో మరో 11 కార్పొరేషన్లకు కొత్త ఛైర్మన్లు

ఆంధ్రప్రదేశ్‌లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఛైర్మన్లను నియమించింది. ఈ మేరకు మొత్తం 11 సంస్థలకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు వివిధ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**నియమితులైన ఛైర్మన్ల జాబితా:**

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్: కల్యాణం శివశ్రీనివాసరావు
ఏపీ స్టేట్ అడ్వైజరీ బోర్డ్ ఆన్ చైల్డ్ లేబర్: సత్యనారాయణ రాజు
ఏపీ అఫిషియల్ లాంగ్వేజ్ కమిషన్: విక్రమ్
ఉర్దూ అకాడమీ: మౌలానా షిబిలీ
ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్: రామ్‌ప్రసాద్
పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా): మధుబాబు
స్టేట్ రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ: శంకర్‌రెడ్డి
కుర్ని, కరికాలభక్తుల వెల్ఫేర్ కార్పొరేషన్: మిన్నప్ప
స్టేట్ షేక్, షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్: ముక్తియార్
భట్రాజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్: వెంకటేశ్వరరాజు
పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ: వీరభద్రరావు



# రెండేళ్లుగా పేలుళ్లకు ప్లాన్!

## భారత్‌లో వరుస పేలుళ్లకు జైషే ప్లాన్

## పేలుడు పదార్థాలు సేకరించిన డాక్టర్ ముజమ్మిల్

## రూ.26 లక్షల సొంత నిధులతోనే విధ్వంసానికి ప్లాన్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన పేలుడు కేసుకు సంబంధించి దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది కేవలం ఒక్క నగరానికి పరిమితమైన దాడి కాదని, దేశవ్యాప్తంగా పలు నగరాల్లో సిరియల్ పేలుళ్లకు జైషే మహ్మద్‌తో సంబంధమున్న ఓ వైట్ కాలర్ ఉగ్రవాద ముఠా భారీ కుట్ర పన్నినట్లు తేలింది. ఈ కుట్రకు 2023లోనే బీజం పడిందని నిందితుల్లో ఒకరు విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. ఈ నెల 10న ఎర్రకోట సమీపంలో ఓ కారులో జరిగిన పేలుడులో 13 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే, ఇది ఉగ్రవాదులు భయంతో ముందుగానే పేల్చేయడం వల్ల జరిగిందని, అసలు ప్రణాళిక మరింత పెద్దదని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఆత్మాహుతి బాంబర్ ఉమర్ మహ్మద్ సహచరుడైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ విచారించగా కీలక వివరాలు వెల్లడయ్యాయి. రెండేళ్లుగా పేలుడు పదార్థాలు, రిమోట్లు, ఇతర సామగ్రిని సేకరిస్తున్నట్లు ముజమ్మిల్ ఒప్పుకున్నాడు. ఈ కుట్ర కోసం హర్యానాలోని గురుగ్రామ్, నుహ్ ప్రాంతాల నుంచి రూ.3 లక్షలతో 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువులు, అమ్మోనియం నైట్రేట్ కొనుగోలు చేశాడు. ఫరీదాబాద్‌లోని మార్కెట్ల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు సమకూర్చుకున్నాడు. రసాయనాలను నిల్వ చేసేందుకు ఓ డీప్ ఫ్రీజర్‌ను కూడా కొనుగోలు చేసినట్లు తేలింది. ఈ కుట్ర కోసం ముఠా సభ్యులు సొంతంగా రూ.26 లక్షలు సమకూర్చుకోవడం గమనార్హం. విచారణలో తుర్కియే, పాకిస్థాన్‌తో ఉన్న సంబంధాలు కూడా బయటపడ్డాయి. ముజమ్మిల్, ఆదిల్, ముజఫర్ అనే ముగ్గురు నిందితులు తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ సభ్యుడి ఆదేశాలతో తుర్కియేకి వెళ్లినట్లు అంగీకరించారు. దర్యాప్తు కొనసాగే కొద్దీ ఈ ఉగ్ర ముఠా వెనుక ఉన్న మరిన్ని దేశీయ, విదేశీ శక్తుల గుట్టు రట్టయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు అరెస్టు


బ్రెసిలియా: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోను బ్రెసిలియాలోని ఆయన నివాసంలో ఫెడరల్ పోలీసులు అరెస్టు చేశారు. 2022 ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి, తిరుగుబాటుకు కుట్ర పన్నారన్న అభియోగాలపై ఆయనకు కోర్టు ఇటీవల 27 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం ఆయనను అరెస్టు చేసిన పోలీసులు, రాజధాని బ్రెసిలియాలోని పోలీసు కేంద్ర కార్యాలయానికి తరలించినట్లు బోల్సోనారో ప్రతినిధి ఒకరు వెల్లడించారు. 2019 నుంచి 2022 వరకు బ్రెజిల్ అధ్యక్షుడిగా ఉన్న బోల్సోనారో, 2022లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఎన్నికల ఫలితాలను అంగీకరించడానికి ఆయన నిరాకరించారు. ఆ సమయంలో వేలాది మంది ఆయన మద్దతుదారులు హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పదవిలో కొనసాగేందుకు బోల్సోనారో తిరుగుబాటు కుట్రకు ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఆయనకు 27 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సెప్టెంబర్ నెలలో తీర్పు వెలువరించింది. ఆయన విచారణ సమయం నుంచే గృహనిర్బంధంలో ఉన్నారు. న్యాయస్థానం విధించిన శిక్షపై అప్పీలుకు వెళ్ళగా అక్కడ ప్రతికూల ఫలితం వచ్చింది. జైలుకు వెళితే ఆయన ప్రాణాలకు ముప్పు ఉంటుందని మాజీ అధ్యక్షుడి తరఫు న్యాయవాదులు వాదించారు. ఆయన ఆరోగ్యం క్షీణించిందని, గృహనిర్బంధంలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అయితే, కోర్టు అందుకు నిరాకరించింది.

## విమర్శించుకున్నా కలిసి పనిచేయాలి

**కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్**

న్యూఢిల్లీ: 'ప్రజాస్వామ్యం అంటే ఇలాగే ఉండాలి. ఎన్నికల సమయంలో మీ సిద్ధాంతం, భావజాలం కోసం ఎంతవరకైనా పోరాడవచ్చు. కానీ ప్రజల తీర్పు వెలువడిన తర్వాత దేశ ప్రయోజనాల దృష్ట్యా అధికార, ప్రతిపక్షాలు పరస్పరం సహకరించుకోవాలి' అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ ఇటీవల సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో వీరిద్దరు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఆ తర్వాత వీరు సామరస్యంగా కలవడం విశేషం. వీరి మధ్య జరిగిన స్నేహపూర్వక సమావేశంపై శశిథరూర్ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక పోస్టు చేశారు. ప్రజాస్వామ్యం ఈ విధంగానే పని చేయాలని, ఇలాంటి స్ఫూర్తిని భారతదేశంలో కూడా చూడాలని ఆకాంక్షించారు.

# అవినీతి ఊబిలో పాక్: ఐఎంఎఫ్



న్యూయార్క్: పాకిస్థాన్‌లో అవినీతి సంబంధిత మనీ లాండరింగ్ ప్రమాదం అత్యంత తీవ్ర స్థాయిలో ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. దేశంలో జవాబుదారీతనం బలహీనంగా ఉండటం, దర్యాప్తు సంస్థల పనిలో తరచూ రాజకీయ జోక్యం జరగడమే ఈ దుస్థితికి ప్రధాన కారణాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ నవంబర్ 19న విడుదల చేసిన 'గవర్నెన్స్ అండ్ కరప్షన్ డయాగ్నస్టిక్' నివేదికలో ఐఎంఎఫ్ ఈ కీలక విషయాలను వెల్లడించింది. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, ప్రభుత్వ కొనుగోళ్లు వంటివి మనీ లాండరింగ్‌కు అత్యంత ప్రమాదకర రంగాలుగా ఉన్నాయి. ముఖ్యంగా రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులతో ముడిపడిన కార్యకలాపాల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉందని తెలిపింది. డొల్ల కంపెనీలు, కార్పొరేట్ వ్యవస్థల దుర్వినియోగం, అనధికారిక నగదు బదిలీ మార్గాల ద్వారా అవినీతి సొమ్మును దాస్తున్నారని వివరించింది. న్యాయవ్యవస్థలో జాప్యం, సుదీర్ఘ విచారణలు, తక్కువ శిక్షల రేటు వల్ల మనీ లాండరింగ్ నిరోధక చట్టాల అమలు నీరుగారిపోతోందని అభిప్రాయపడింది. అయితే, దేశంలో మారుతున్న పరిస్థితులను కూడా ఐఎంఎఫ్ ప్రస్తావించింది. పాక్ జనాభాలో 60 శాతానికి పైగా 30 ఏళ్లలోపు యువతే ఉండటం, వారు అవినీతిని ఏమాత్రం సహించకపోవడంతో జవాబుదారీతనం కోసం డిమాండ్ పెరుగుతోందని పేర్కొంది. ఈ ఒత్తిడి కారణంగా రాజకీయ నాయకులు కూడా అవినీతిని అరికట్టాల్సిన అవసరాన్ని గుర్తిస్తున్నారని తెలిపింది. పాకిస్థాన్‌లోని నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో వంటి దర్యాప్తు సంస్థల పనితీరులో తీవ్ర లోపాలు ఉన్నాయని ఐఎంఎఫ్ ఎత్తిచూపింది. అవినీతి ఫిర్యాదులపై అధికారిక విచారణ ప్రారంభించడానికే సుమారు నాలుగు నెలల సమయం పడుతోందని, చాలా ఫిర్యాదులు మధ్యలోనే ఆగిపోతున్నాయని తెలిపింది. 2023-24లో 17 బ్యాంకులపై రూ.944 మిలియన్ల జరిమానాలు విధించినప్పటికీ, రాజకీయ సంబంధాలున్న కేసుల్లో దర్యాప్తు పక్షపాతంగా జరుగుతోందనే ఆందోళనలు ఉన్నాయని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయ లోపం, పారదర్శకత లేకపోవడం వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొంది.

# భారత్-ఆఫ్ఘన్ వెరీ క్లోజ్!

**వాణిజ్యాన్ని విస్తరించనున్న ఇరుదేశాలు**

**ఢిల్లీ, అమృత్‌సర్ నుంచి కాబూల్‌కు రెండు కార్గో విమానాలు**



న్యూఢిల్లీ: భారత్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలు తమ ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. పాకిస్థాన్ రూపంలో ఉన్న అడ్డంకులను అధిగమించి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాణిజ్యాన్ని విస్తరించాలని ఇరు దేశాలు నిశ్చయించాయి. ఇందులో భాగంగా ఇరాన్‌లోని చాబహార్ పోర్టును మరింత విస్తృతంగా ఉపయోగించుకోవడంతో పాటు ఢిల్లీ, అమృత్‌సర్ నుంచి కాబూల్‌కు రెండు ప్రత్యేక కార్గో విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ తాత్కాలిక వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నూరుద్దీన్ అజీజీ, భారత విదేశాంగ శాఖ జాయింట్ సెక్రటరీ ఆనంద్ ప్రకాశ్ శుక్రవారం ఈ వివరాలను వెల్లడించారు. ఇప్పటికే ఇరు దేశాల మధ్య బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్యం జరుగుతుండగా, తాజా చర్యలతో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. పాకిస్థాన్ ఆక్రమిత గిల్గిత్-బాల్టిస్థాన్ కారణంగా భారత్-ఆఫ్ఘన్ మధ్య నేరుగా భూమార్గం అందుబాటులో లేకపోవడంతో, సముద్ర, వాయు మార్గాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ సందర్భంగా మంత్రి అజీజీ మాట్లాడుతూ రాజకీయాలను వ్యాపారంతో ముడిపెట్టవద్దని, తమ దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు భారత వ్యాపారులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. మైనింగ్, వ్యవసాయం, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేవారికి పన్ను మినహాయింపులు, ఉచితంగా భూమి కేటాయింపు వంటి ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఆఫ్ఘన్ సిక్కు, హిందూ కమ్యూనిటీలు కూడా వాణిజ్యంలో పాలుపంచుకోవాలని కోరారు. పాకిస్థాన్‌తో వాణిజ్య సంబంధాలు క్షీణిస్తుండటం, సరిహద్దుల మూసివేత వల్ల ఆఫ్ఘన్ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో తాజా నిర్ణయాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న కార్గో విమాన సర్వీసుల ద్వారా పండ్లు, ఔషధ మొక్కలు వంటివి వేగంగా రవాణా చేసేందుకు వీలవుతుంది

## ట్రంప్ శాంతి ప్రణాళికకు

# పుతిన్ గ్రీన్ సిగ్నల్

**ఇదే తుది పరిష్కారానికి ఆధారం కావచ్చని వ్యాఖ్య**

మాస్కో: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 28-అంశాల శాంతి ప్రణాళికకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. 2022 నుంచి కొనసాగుతున్న ఈ భీకర యుద్ధానికి ఒక తుది పరిష్కారం కనుగొనడానికి ఈ ప్రణాళికను ప్రాతిపదికగా తీసుకోవచ్చని ఆయన శుక్రవారం వ్యాఖ్యానించారు. టెలివిజన్‌లో చేసిన ప్రసంగంలో పుతిన్ ఈ విషయం వెల్లడించారు. అమెరికా నుంచి తమకు ప్రతిపాదన అందిన విషయాన్ని ధ్రువీకరించారు. "తుది శాంతియుత పరిష్కారానికి దీనిని ఆధారంగా ఉపయోగించుకోవచ్చని నేను నమ్ముతున్నాను" అని పుతిన్ పేర్కొన్నారు. అలాస్కాలోని యాంకరేజ్‌లో జరిగిన చర్చల సందర్భంగా అమెరికా వైపు నుంచి కొన్ని సర్దుబాట్లు, సౌలభ్యం చూపాలని కోరినట్లు పుతిన్ తెలిపారు. కొన్ని క్లిష్టమైన సమస్యలు ఉన్నప్పటికీ రష్యా ఈ ప్రతిపాదనకు అంగీకరించిందని ఆయన వివరించారు. అదే సమయంలో ఈ ప్రతిపాదనను ఉక్రెయిన్ తిరస్కరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పుతిన్ హెచ్చరించారు. "ఒకవేళ కీవ్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తే గతంలో కుపియాన్స్క్‌లో జరిగిన పరిణామాలే యుద్ధరంగంలోని ఇతర కీలక ప్రాంతాల్లోనూ పునరావృతం అవుతాయి. మొత్తం మీద ఈ పరిస్థితి మాకు ఆమోదయోగ్యమే" అని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ఈ శాంతి ప్రణాళిక రష్యా డిమాండ్లకు అనుకూలంగా ఉందని భావిస్తున్న ఉక్రెయిన్ తీవ్ర సందిగ్ధంలో పడింది. దీనిపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ "ఇప్పుడు ఉక్రెయిన్ ముందు చాలా కఠినమైన ఎంపిక ఉంది. ఆత్మగౌరవాన్ని వదులుకోవడమా? లేక ఒక ప్రధాన భాగస్వామి (అమెరికా) మద్దతును కోల్పోవడమా? అనేది తేల్చుకోవాలి" అని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, నిజమైన, గౌరవప్రదమైన శాంతిని అందించే ప్రణాళిక కోసం తాము ఎదురుచూస్తున్నామని, ట్రంప్ బృందం ప్రయత్నాలను గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. శాంతి ప్రణాళికను అంగీకరించేందుకు ఉక్రెయిన్‌కు వచ్చే గురువారం వరకు ట్రంప్ గడువు విధించారు.

# అజ్ఞాతంలో నోబెల్ విజేత మరియా



న్యూయార్క్: వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోను ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక బహుమతి నోబెల్ శాంతి పురస్కారం వరించిన విషయం తెలిసిందే. అయతే, ఈ పురస్కారాన్ని అందుకోవడంలో మరియా కొత్త చిక్కులను ఎదుర్కొంటున్నారు. నోబెల్ పురస్కారాలను డిసెంబర్ 10న నార్వేలోని ఓస్లోలో ప్రధానం చేయనున్నారు. ఈ వేడుకకు హాజరయ్యే విషయంలో మరియాకు ఇబ్బందులు తప్పడంలేదు. వెనెజువెలా ప్రభుత్వ ఆంక్షల కారణంగా ప్రస్తుతం ఆమె అజ్ఞాతంలో ఉన్నారు. నోబెల్ అందుకోవడానికి నార్వేకు వెళితే మరియాను పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని తాజాగా వెనెజువెలా అటార్నీ జనరల్ ప్రకటించారు. దేశాధ్యక్షుడిపై ప్రజల్లో విద్వేషాన్ని ప్రేరేపించడం, ప్రభుత్వంపై కుట్ర, ఉగ్రవాదం సహా పలు ఆరోపణలు మరియాపై ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆమెపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈమేరకు అటార్నీ జనరల్ తాజాగా విడుదల చేసిన నివేదికలో మరియాపై పలు ఆరోపణలు చేశారు. వెనెజువెలా చుట్టూ ఉన్న సముద్ర జలాల్లో అమెరికా సైనిక దళాల మోహరింపునకు మరియా మద్దతునిచ్చారని ఆరోపిస్తూ ఈ విషయంలో ఆమెపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఈ క్రమంలోనే నోబెల్ పురస్కారం కోసం మరియా వెనెజువెలా దాటి వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కాగా, వెనెజువెలా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నందుకు మరియాను ఈ ఏడాది శాంతి బహుమతికి ఎంపిక చేసినట్లు నోబెల్ కమిటీ ప్రకటించింది. వెనెజువెలాలో ప్రజాస్వామ్యం ఏర్పాటుకు ఆమె విశేష కృషి చేస్తున్నారని కొనియాడింది. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి, అధ్యక్షుడి నుంచి ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నప్పటికీ మరియా వెనక్కి తగ్గలేదని పేర్కొంది. అజ్ఞాతంలో ఉంటూనే ప్రజల కోసం పోరాటం చేస్తున్నారని మరియాను ప్రశంసించింది.

## మావాళ్లను గెలిపిస్తేనే నిధులు

**అజిత్ పవార్ వివాదాస్పద వ్యాఖ్యలు**



ముంబై: ఎన్సీపీ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బారామతిలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను తిరస్కరిస్తే నిధుల కేటాయింపు విషయంలో తానూ అదే విధంగా వ్యవహరిస్తానని వ్యాఖ్యానించారు. స్థానికంగా ఎన్సీపీకి చెందిన 18 మంది అభ్యర్థులను గెలిపిస్తేనే ఆ ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. హామీలను నెరవేర్చే విషయంలో తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. "మీ వద్ద ఓట్లు ఉన్నాయి, నా వద్ద నిధులు ఉన్నాయి. మీరు తిరస్కరిస్తే నేను కూడా తిరస్కరిస్తాను" అని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా తన వద్ద నిధులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అజిత్ పవార్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఆయన ఓటర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని విమర్శించాయి. అజిత్ పవార్ తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మాట్లాడుతున్నారని, ప్రజలు కట్టిన పన్నుల ద్వారానే నిధులు విడుదల అవుతాయని శివసేన (యూబీటీ) నేత అంబాదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎక్స్‌లో కొత్తగా 'అబౌట్ దిస్ అకౌంట్'

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల్లో పెరిగిపోతున్న నకిలీ ఖాతాలు, తప్పుడు సమాచార వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ 'ఎక్స్' కీలక ముందడుగు వేసింది. 'అబౌట్ దిస్ అకౌంట్' పేరుతో ఒక సరికొత్త ఫీచర్‌ను యూజర్ల ముందుకు తీసుకొచ్చింది. దీని ద్వారా ఏదైనా ఖాతా యొక్క విశ్వసనీయతను సులభంగా అంచనా వేయవచ్చు. ఈ ఫీచర్ ప్రస్తుతం దశలవారీగా యూజర్లందరికీ అందుబాటులోకి వస్తోందని ఎక్స్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ఫేక్ అకౌంట్లు, ఆటోమేటెడ్ బాట్‌ల బెడద తీవ్రంగా ఉంది. అసలు ఖాతాలను పోలిన నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, వాటి ద్వారా సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే కంటెంట్, జాతి వ్యతిరేక పోస్టులు, రాజకీయ దుష్ప్రచారాలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఉదాహరణకు, భారతీయుడిగా చెప్పుకుంటూ పోస్టులు పెట్టే ఒక ఖాతాను నిజంగా భారతదేశం నుంచే నిర్వహిస్తున్నారా లేక విదేశాల్లోని శక్తులు మన దేశం నుంచి ఆపరేట్ చేస్తున్నట్టు భ్రమింపజేస్తున్నాయా అనేది తెలుసుకోవడం సాధారణ యూజర్లకు కష్టసాధ్యంగా మారింది. ఇలాంటి మోసపూరిత కార్యకలాపాలను నియంత్రించడమే ఈ కొత్త ఫీచర్ ప్రధాన లక్ష్యం. ఈ సమస్యకు పరిష్కారంగానే ఎక్స్ ఈ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. యూజర్లు ఏదైనా ప్రొఫైల్‌ను సందర్శించినప్పుడు, అక్కడ కనిపించే 'అబౌట్ దిస్ అకౌంట్' ఆప్షన్‌పై క్లిక్ చేస్తే ఆ ఖాతాకు సంబంధించిన కీలక సమాచారం కనిపిస్తుంది.

## డీకే సీఎం పీఠం కోసమే!

**జైల్లో ఎమ్మెల్యేలను కలిశారు.. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపణలు**



బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇద్దరూ తమ బలాలను నిరుపించుకునేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో నిమగ్నమయ్యారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. అందులో భాగంగానే డీకే నిన్న బెంగళూరు సెంట్రల్ జైలుకు వెళ్లి అక్కడ ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వినయ్ కులకర్ణి, వీరేంద్ర పప్పీని కలిశారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి పీఠం దక్కాలంటే ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాబట్టి ఇన్ని రోజులు వారిని కలవని డీకే శివకుమార్, ఇప్పుడు జైలుకు వెళ్లి మరీ కలవడం విమర్శలకు తావిస్తోందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజీనామా చేయాలని డీకే అడిగినప్పుడల్లా ఎంతమంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అధిష్ఠానం అడుగుతున్నట్లుగా ఉందని, అందుకే ఆయన ఎమ్మెల్యేలను కూడగట్టుకుంటున్నారని అన్నారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై డీకే వర్గానికి చెందిన ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించారు. డీకేకు సొంత బలం, సామర్థ్యాలు ఉన్నాయని అన్నారు. తనకు ఉన్న మద్దతును ఢిల్లీలో ప్రదర్శించడం లేదా గొడవలు సృష్టించడం వంటి అవసరం ఆయనకు లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు.

## హిందువుల వల్లే ప్రపంచం

**మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ హిందూ సమాజంపై కీలక వ్యాఖ్యలు చేశారు. హిందువులు లేకపోతే ఈ ప్రపంచమే అంతరించిపోతుందని, ప్రపంచ మనుగడకు హిందూ సమాజమే కేంద్రమని ఆయన స్పష్టం చేశారు. మణిపూర్‌లో పర్యటిస్తున్న ఆయన ఓ సభలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీస్ (యూనాన్), ఈజిప్ట్ (మిస్ర్), రోమ్ వంటి గొప్ప నాగరికతలు కాలగర్భంలో కలిసిపోయాయని, కానీ భారత నాగరికత మాత్రం ఇప్పటికీ నిలిచి ఉందని మోహన్ భగవత్ గుర్తుచేశారు. "ప్రపంచంలోని ప్రతీ దేశం ఎన్నో రకాల పరిస్థితులను చూసింది. కానీ మన నాగరికతలో ఏదో ప్రత్యేకత ఉంది, అందుకే మనం ఇంకా ఇక్కడే ఉన్నాం. హిందూ సమాజం అమరమైనది" అని ఆయన వివరించారు. భారత్ అనేది ఒక అమర నాగరికతకు పేరు అని పేర్కొన్న భగవత్.. ప్రపంచ ధర్మాన్ని కాపాడే సంరక్షకులుగా హిందూ సమాజాన్ని అభివర్ణించారు. "మన సమాజంలో మనం నిర్మించుకున్న బలమైన వ్యవస్థ కారణంగా హిందూ సమాజం ఎప్పటికీ ఉంటుంది. హిందువులు లేకపోతే ప్రపంచం అంతం కావడం ఖాయం" అని ఆయన అన్నారు. మణిపూర్‌లో జాతి ఘర్షణలు చెలరేగిన తర్వాత మోహన్ భగవత్ ఆ రాష్ట్రంలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## బంగ్లాదేశ్‌లో భూకంపం..

**10 మంది మృతి**

ఢాకా: బంగ్లాదేశ్‌లో శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. శుక్రవారం ఉదయం సంభవించిన ఈ భూప్రకంపనల కారణంగా కనీసం 10 మంది ప్రాణాలు కోల్పోగా, 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.7గా నమోదైనట్లు బంగ్లాదేశ్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం మృతుల్లో నలుగురు రాజధాని ఢాకాలో, ఐదుగురు నర్సింగ్దిలో, ఒకరు నారాయణగంజ్‌లో మరణించారు. ఢాకాలోని అర్మానిటోలా ప్రాంతంలో ఒక భవనం పైకప్పు రెయిలింగ్ కూలిపోవడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. నర్సింగ్ది జిల్లాలోని మధాబ్ది ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా పలుచోట్ల తీవ్ర విషాదకర ఘటనలు చోటుచేసుకున్నాయి. గాజీపూర్‌లోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో భూమి కంపించడంతో కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో 150 మందికి పైగా కార్మికులు గాయపడ్డారు. అదేవిధంగా ఢాకా యూనివర్సిటీలో పలువురు విద్యార్థులు భయంతో భవనాలపై నుంచి కిందకు దూకడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఢాకా సహా పలు నగరాల్లోని అనేక భవనాలకు స్వల్పంగా పగుళ్లు ఏర్పడ్డాయి. భూకంపం తర్వాత తమ ఇళ్లలోని గోడలకు పగుళ్లు ఏర్పడిన ఫొటోలు, వీడియోలను స్థానికులు సోషల్ మీడియాలో పంచుకున్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.



లహరి చిత్రం

ఐశ్వ అగర్వాల్



## వేణు ఊడుగుల మల్టీస్టారర్!

నీది నాది ఒకే కథ సినిమాతో డైరెక్టర్ గా తన మార్క్ వేసుకున్న వేణు ఊడుగుల తన రెండో ప్రయత్నంగా విరాటపర్వం అనే సినిమాతో వచ్చాడు. రానా, సాయి పల్లవి కలిసి నటించిన ఈ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ అవ్వలేదు కానీ సినిమా మాత్రం వేణుకి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఐతే ఈ డైరెక్టర్ మూడో సినిమా ఎప్పుడు 3 ఏళ్లుగా ఏం చేస్తున్నాడన్న చర్చ నడుస్తుంది. లేటెస్ట్ గా రాజు వెడ్స్ రాంబాయి సినిమాతో మరోసారి సర్ ప్రైజ్ చేశాడు వేణు. ఆ సినిమాకు వెనక ఉండి నడిపించింది ఆయనే. రాజు వెడ్స్ రాంబాయి సినిమాకు వేణు కాంట్రిబ్యూషన్ ఇంప్రెస్ చేస్తుంది. ఐతే వేణు ఈ సినిమా ప్రమోషన్స్ లో తన నెక్స్ట్ ప్రాజెక్ట్ పై ఇంట్రెస్టింగ్ డీటైల్స్ చెప్పారు. నెక్స్ట్ తానొక మల్టీస్టారర్ కథ చేస్తున్నట్టు చెప్పారు వేణు. అసలైతే తెలుగు సీనియర్ హీరో ఒకరు.. యువ హీరో మరొకరు ఇలా ఈ మల్టీస్టారర్ ప్లాన్ చేసుకున్నాడట వేణు. ఆ సీనియర్ హీరోకి కథ నచ్చినా ఎందుకో ఫైనల్ డిస్కషన్స్ లో ఆయన కాదన్నారట. ఐతే ఇప్పుడు వేణు ఊడుగుల ఆ కథను మోహన్ లాల్ కి వినిపించే ప్రయత్నాల్లో ఉన్నారట. మలయాళంలో తన మార్క్ సినిమాలు చేస్తూ అదరగొట్టేస్తున్న మోహన్ లాల్ ఇతర భాషల ఆఫర్లు చేస్తూ వచ్చారు. ముఖ్యంగా తెలుగులో ఆయన జనతా గ్యారేజ్, మనమంతా రీసెంట్ గా కన్నప్పలో క్యామియో రోల్ చేసి మెప్పించారు. ఇప్పుడు వేణు ఊడుగుల సినిమాకు ఓకే చెబితే మాత్రం టాలెంటెడ్ డైరెక్టర్ కి వర్సటైల్ యాక్టర్ దొరికినట్టే అవుతుంది. ఇక ఈ సినిమాలో మరో యాక్టర్ గా శ్రీకాంత్ తనయుడు రోషన్ ని తీసుకుంటున్నారట. రోషన్ ఛాంపియన్ తర్వాత సినిమా ఇదే అయ్యే ఛాన్స్ ఉంది. ఐతే ఆమధ్య వేణు ఊడుగుల వెంకటేష్ తో సినిమా చేయాలని ఒక స్టోరీ కూడా చెప్పాడన్న టాక్ వచ్చింది. ఒకవేళ ఈ మల్టీస్టారర్ కథలో కూడా వెంకటేష్ మొదటి ఆప్షన్ అయ్యి ఉండొచ్చని కొందరి కామెంట్. ఐతే డిస్కషన్ లో ఉన్న సినిమా కాబట్టి అలాంటి ఒపీనియన్ చెప్పడం కష్టం. వేణు విషయానికి వస్తే ఈ డైరెక్టర్ సరైన ఫోకస్ చేస్తే మాత్రం కచ్చితంగా తెలుగులో స్టార్ డైరెక్టర్ గా అదరగొట్టే ఛాన్స్ ఉంటుంది. విరాటపర్వం తర్వాత గ్యాప్ తీసుకున్న డైరెక్టర్ ఇక మీదట వరుస సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యాడు.

## రేట్లు ఎక్కువైతే పైరసీ చేస్తారా?: బన్నీ వాసు

ఇటీవల పైరసీ వెబ్‌సైట్ అడ్మిన్ 'ఐబొమ్మ రవి' అరెస్ట్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అయితే, ఇక్కడే ఒక విచిత్రమైన ధోరణి సోషల్ మీడియాలో కనిపిస్తోంది. 'సినిమా టికెట్ రేట్లు సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నాయి.. అందుకే మేము పైరసీలో చూస్తున్నాం, మాకు పైరసీ చేసేవాడే హీరో' అంటూ కొందరు ఆ అరెస్ట్‌ను తప్పుబడుతున్నారు. ఈ వ్యవహారంపై ప్రముఖ నిర్మాత బన్నీ



వాసు తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాకు సంబంధించిన ఈవెంట్‌లో పాల్గొన్న బన్నీ వాసు, పైరసీని సమర్థించే వారి తీరును తప్పుబడుతూ ఎమోషనల్ అయ్యారు. రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు బన్నీ వాసు సమాధానమిస్తూ.. 'రేట్లు పెంచేశారు అందుకే పైరసీ చూస్తున్నాం అనేది ఒక సాకు మాత్రమే. సంవత్సరానికి 100 సినిమాలు వస్తే, అందులో టికెట్ రేట్లు పెంచేది కేవలం 10 లేదా 15 పెద్ద సినిమాలకు మాత్రమే. మరి మిగిలిన 85 చిన్న సినిమాలను ఎందుకు పైరసీలో చూస్తున్నారు?' అని ప్రశ్నించారు.

## అలా ఆలోచించి తప్పు చేశా

సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం అనే సినిమాతో పాటు, ఒక భారీ వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. ఒక వైపు షూటింగ్‌తో బిజీగా ఉన్నప్పటికీ సమంత రెగ్యులర్‌గా వర్కౌట్ చేయకుండా మాత్రం ఉండదు. సమంత వర్కౌట్ గురించి గతంలో చాలా మంది ప్రశంసిస్తూ కామెంట్స్ చేసిన విషయం తెల్సిందే. ఎంత బిజీగా ఉన్నప్పటికీ రోజులో ఏదో ఒక సమయంలో సమంత కొంత సేపు అయిన వర్కౌట్స్ చేస్తుందట. సమంత ఈ విషయాన్ని పలు సార్లు చెప్పుకొచ్చింది. బాడీని ఫిట్‌గా ఉంచుకోవడం కోసం, ఆరోగ్యం కాపాడుకోవడం కోసం సమంత రెగ్యులర్ వర్కౌట్స్ చేస్తుంది. సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో తన ఫిజికల్ ఫిట్‌నెస్‌కి సంబంధించిన విషయాలను షేర్ చేసింది. 'కొన్ని సంవత్సరాల క్రితం నా వెన్నెముక చాలా వీక్‌గా ఉండేది. నాకు వారసత్వంగా ఆ బలహీనత వచ్చిందని నాకు నేను సరి పెట్టుకున్నాను. ఆ సమయంలో నేను ఎలాంటి ప్రయత్నం చేయలేదు. నా జీన్స్ లోపం కారణంగా ఎప్పుడూ నా వెన్నెముక నొప్పి ఉంటుంది అనుకున్నాను. కానీ ఇతరులను చూసి నేను చాలా ఆశ్చర్యపోయే దాన్ని. వారి యొక్క వెన్నుముక చాలా స్ట్రాంగ్‌గా ఉండటంతో పాటు, వారికి ఎలాంటి నొప్పి లేకపోవడం చూసి ఆలోచన మొదలైంది. ఇన్నాళ్లు నేను తప్పు చేశాను అనిపించింది. నా వెన్నెముక నొప్పిని జన్యు లోపంగా భావించి తప్పు చేశాను' అని సమంత చెప్పుకొచ్చింది.





## ఫస్ట్.. సెకండ్ అనడం నచ్చదు

కథ, పాత్రలను బట్టి ఒక సినిమాకు ఒక్కోసారి నలుగురు హీరోయిన్లు కూడా మేకర్స్ ఎంపిక చేస్తుంటారు. ఎంత మంది భామలున్నా పాత్రలకంటూ కొంత ప్రాధాన్యత ఉంటుంది. దాన్ని బేస్ చేసుకుని ఫస్ట్ లీడ్.. సెకెండ్ లీడ్.. థర్డ్ లీడ్ గా డివైడ్ అవుతుంటాయి. సినిమాలో ముఖ్య నాయిక ఒకరు హైలైట్ అవుతారు. ఆ పాత్ర ఆరంభం నుంచి ముగింపు వరకూ హీరోతో పాటు ట్రావెల్ అవుతుంది. ఏ భాషలోనైనా నాయికల ప్రాధాన్యత విషయంలో ఈ లైనప్ కనిపిస్తుంది. అయితే నాయికల్ని ఇలా డివైడ్ చేయడంపై నటి అనుపమ పరమేశ్వరన్ కు నచ్చనట్లు కనిపిస్తోంది. ఫస్ట్ లీడ్.. సెకెండ్ లీడ్ అంటూ పిలవడం తనకు ఎంత మాత్రం నచ్చలేదంది. ఈ మధ్య కాలంలో ఈ పదాలు ఎక్కువగా వినిపిస్తున్నాయంది. అవసరం లేని పదాలు అనవసరంగా వేస్తున్నారంది. ప్రేమమ్ లో సాయిపల్లవి, మడోన్నా, నేను నటించాం. ముగ్గురు ఎవరి పాత్రలు వారు పోషించాం.

## నేనేంటో అప్పుడే తెలిసింది



హీరోయిన్‌గా రాశి ఖన్నా ఊహలు గుసగుసలాడే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా 2014లో వచ్చిన విషయం తెల్సిందే. అప్పటి నుంచి వరుస సినిమాలు చేస్తూ వచ్చింది. కానీ తనకు నటిగా గుర్తింపు దక్కింది మాత్రం తొలి ప్రేమ సినిమాతో అంటూ ఇటీవల ఇంటర్వ్యూలో రాశి ఖన్నా వ్యాఖ్యలు చేసింది. 2018లో విడుదలైన తొలిప్రేమ సినిమాలో రాశి ఖన్నా నటనకు మంచి మార్కులు దక్కాయి అనేది వాస్తవం. కానీ అంతకు ముందు సినిమాలు ఏవీ కూడా ఆమెను కనీసం నటిగా చూపించలేక పోయాయి అనేది మాత్రం వాస్తవం కాదు. కానీ రాశి ఖన్నా తనను అంతకు ముందు కమర్షియల్ హీరోయిన్‌గా మాత్రమే చూశారు, ఎప్పుడైతే నేను తొలి ప్రేమ సినిమా చేశానో అప్పటి నుంచి నా గురించి మాట్లాడుకోవడం మారి పోయింది, నా ప్రతిభ గురించి, నా యొక్క లుక్ గురించి, నటన గురించి మాట్లాడుకున్నారని రాశి ఖన్నా చెప్పుకొచ్చింది. తొలిప్రేమ సినిమాలో నటించిన తర్వాత తన వ్యక్తిగతంగా కూడా చాలా మార్పులు వచ్చాయని రాశి ఖన్నా చెప్పుకొచ్చింది. ఆ సినిమా హీరోయిన్‌గా నన్ను ప్రేక్షకులు చూసే కోణం మారేలా చేసింది. అందుకే తన కెరీర్‌లో తొలిప్రేమ సినిమా చాలా ప్రత్యేకమైనదిగా రాశి ఖన్నా చెప్పుకొచ్చింది. హీరోయిన్‌గా తనకు ఆ తర్వాత వచ్చిన మరికొన్ని సినిమాలు సైతం నటిగా సంతృప్తిని కలిగించాయి అని చెప్పుకొచ్చింది. హీరోయిన్స్ అన్ని సినిమాలను గొప్పగా చేయాలి అనుకుంటే సాధ్యం అయ్యే పని కాదని, చాలా తక్కువ ఆఫర్లు మాత్రమే ప్రతిభ నిరూపించుకునేవి ఉంటాయి.

## రోల్స్‌రాయిస్ అంత ఖరీదు ప్రేమ..


పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రంలో నటించింది నర్గీస్ ఫక్రి. ఈ బాలీవుడ్ బ్యూటీ చాలా కాలంగా అవకాశాల్లేక కెరీర్ పరంగా డల్ అయిపోయిన సమయంలో పవర్ స్టార్ ఆఫర్ ఉత్తేజం నింపింది. కానీ వీరమల్లు తనకు సౌత్ లో అవకాశాల్ని కల్పించలేదు. 2025లో రెండు భారీ చిత్రాల్లో నటించినా అవేవీ కలిసి రాలేదు. హౌస్ ఫుల్ 5 మంచి కలెక్షన్లు తెచ్చినా దానివల్ల నర్గీస్ కి కలిసొచ్చిందేమీ లేదు. మస్తీ 4 లాంటి అడల్ట్ కామెడీ కూడా ఏమాత్రం తనకు వర్కవుట్ కాలేదు. ఇది నిరాశాజనకమైన ఏడాదిగానే ముగిసింది. అందుకే ఇప్పుడు 2026లో తన కెరీర్ ని రీవ్యాంప్ చేసేందుకు నర్గీస్ సిద్ధమవుతోంది. ఈసారి కథాబలంతో పాటు, తన పాత్రకు కూడా మంచి గుర్తింపు ఉండాలని కోరుకుంటోందిట. కేవలం బాలీవుడ్ లోనే కాదు తెలుగు, తమిళంలోను నటించాలని ఉవ్విళ్లూరుతోందని తెలుస్తోంది. అంతకంటే ముందే ఈ బ్యూటీకి పెళ్లయిందన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి. నర్గీస్ ఈ ఏడాది ఆరంభం తన ప్రియుడు టోనీ బేగ్ ని పెళ్లాడింది. ఎలాంటి హంగామా లేకుండా అమెరికా - కాలిఫోర్నియాలో అతడిని పెళ్లాడిన నర్గీస్ ప్రస్తుతం సంసార జీవనంలో తలమునకలుగా ఉంది. కెరీర్ కంటే ఇప్పుడు తన భర్త ఆలనాపాలనా కూడా చాలా ముఖ్యం. అతడి సాంగత్యంలో అన్ని ఒత్తిళ్లను మర్చిపోతోంది. ఇప్పుడు నర్గీస్ 46వ పుట్టినరోజున టోనీ ఆమెను ఒక క్రేజీ రోల్స్ రాయిస్‌తో ఆశ్చర్యపరిచాడు. దాదాపు 10.3 కోట్ల రూపాయల విలువైన నీలిరంగు రోల్స్ రాయిస్ ని నర్గీస్‌కు కానుకగా ఇచ్చాడు టోనీ. తనకు అందిన ఖరీదైన కార్ గిఫ్ట్ ని చూసుకుని నర్గీస్ మురిసిపోతోంది.





# రెండ్రోజుల్లోనే మ్యాచ్ బూడిద!

## 847 బంతుల్లోనే ముగిసిన యాషెస్ తొలి టెస్ట్



టెస్ట్ క్రికెట్‌లో ఆస్ట్రేలియా చరిత్ర సృష్టించింది. 148 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 200 ప్లస్ లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా నిలిచింది. యాషెస్ సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా శనివారం ముగిసిన తొలి టెస్ట్‌లో ఇంగ్లండ్‌ను 8 వికెట్ల తేడాతో ఓడించడం ద్వారా ఈ ఫీట్ సాధించింది. బౌలర్లు ఆధిపత్యం చెలాయించిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ విధించిన 205 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 28.2 ఓవర్లలోనే ఛేదించింది.

**ట్రావిస్ హెడ్(83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123) టీ20 తరహా బ్యాటింగ్‌తో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ విజయంతో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఈ విజయంతో ఆసీస్.. ఇంగ్లండ్ రికార్డ్‌ను అధిగమించింది. ఇంగ్లండ్ 204 పరుగుల లక్ష్యాన్ని 35.3 ఓవర్లలో అధిగమించగా.. న్యూజిలాండ్ 217 పరుగుల టార్గెట్‌ను 39.4 ఓవర్లలో ఛేదించింది.**



### ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ విధ్వంసం

### నాలుగో ఇన్నింగ్స్‌లో 69 బంతుల్లోనే సెంచరీ

### 123 ఏళ్ల రికార్డు బద్ధలు.. ఆస్ట్రేలియా విజయం

ఇప్పటి వరకు ఇవే ఫాస్టెస్ట్ టార్గెట్ ఛేజింగ్ రికార్డ్స్‌గా ఉండగా.. ఆసీస్ తాజా విజయంతో వాటిని కనుమరుగు చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై అత్యంత వేగంగా ముగిసిన మ్యాచ్‌గా కూడా ఇది చరిత్రకెక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలింది. హ్యారీ బ్రూక్(61 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఓలీ పోప్(58 బంతుల్లో 4 ఫోర్లతో 46), జెమీ స్మిత్(22 బంతుల్లో 6 ఫోర్లతో 33) పర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(7/58) ఏడు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. బ్రెండన్ డొగ్గెట్(2/27) రెండు వికెట్లు తీయగా.. కామెరూన్ గ్రీన్‌కు ఓ వికెట్ దక్కింది. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైంది. అలెక్స్ క్యారీ(26), కామెరూన్ గ్రీన్(24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ట్రావిస్ హెడ్(21) విఫలమయ్యాడు. బెన్ స్టోక్స్(5/23) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్ (3/45) మూడు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్(2/11)కు రెండు వికెట్లు దక్కాయి. 40 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 164 పరుగులకు ఆలౌటైంది. గస్ అట్కిన్సన్(32 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37), ఓలీ పోప్(57 బంతుల్లో 2 ఫోర్లతో 33) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/55)తో పాటు స్కాట్ బోలాండ్(4/33) నాలుగు వికెట్లు పడగొట్టాడు. బ్రెండన్ డొగ్గెట్(3/51) మూడు వికెట్లు తీసాడు. దాంతో ఆసీస్ ముందు 205 పరుగుల లక్ష్యం నమోదైంది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న ఈ వికెట్‌పై ఈ లక్ష్యాన్ని ఛేదించడం ఆసీస్‌కు కష్టమవుతుందని అంతా అనుకున్నారు. కానీ ట్రావిస్ హెడ్ ఓపెనర్‌గా బరిలోకి దిగి టీ20 బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు.



## మళ్లీ గంభీర్ అదే తప్పు!

సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియా ఓటమికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాలే కారణమనే అభిప్రాయం వ్యక్తమైంది. సరైన కాంబినేషన్‌తో బరిలోకి దిగకపోవడం.. పిచ్ కండిషన్స్ తగ్గట్లు జట్టును సిద్ధం చేయకపోవడం.. స్పెషలిస్ట్ బ్యాటర్లకు బదులు ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యత ఇవ్వడం, ఏకపక్షంగా టర్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేయడం వంటి తప్పిదాలు టీమిండియా ఓటమికి కారణమయ్యాయనే విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మూడో స్థానంలో సాయి సుదర్శన్‌కు బదులు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ఆడించడం టీమిండియాకు తీవ్ర నష్టం చేసింది. దాంతో సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. ఈ ఓటమి నుంచి గంభీర్ ఏ మాత్రం పాఠాలు నేర్చుకోలేదు. గౌహతి వేదికగా శనివారం ప్రారంభమైన రెండో మ్యాచ్‌లోనూ గంభీర్ అవే తప్పిదాలను పునరావృతం చేశాడు. పిచ్ కండిషన్స్‌ను సరిగ్గా అంచనా వేయలేకపోయిన గంభీర్.. మరోసారి ఆల్‌రౌండర్లకే ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 2 మార్పులతో బరిలోకి దిగింది. శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్ స్థానాల్లో సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి తుది జట్టులోకి వచ్చారు. ఏ మాత్రం ఫామ్‌లో లేని నితీష్ కుమార్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.



## ఓటమిని నేనే బాధ్యుడిని

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025 టీ20 టోర్నీలో టీమిండియా ఓడిపోవడంపై కెప్టెన్ జితేష్ శర్మ స్పందించాడు. ఓటమికి పూర్తి బాధ్యత తనదేనని అన్నాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన జితేష్ శర్మ.. వైభవ్ సూర్యవంశీని సూపర్ ఓవర్‌లో ఆడించకపోవడం వెనుక ఉన్న కారణాన్ని వెల్లడించాడు. ఈ ఓటమికి తనదే పూర్తి బాధ్యత అని కూడా చెప్పాడు. 'మా జట్టులో వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య పవర్ ప్లే ఆడటంలో మాస్టర్లు. డెత్ ఓవర్లలో నాతో పాటు అషుతోష్ శర్మ, రమణ్‌దీప్‌లు భారీ షాట్లు ఆడగలరు. ఈ క్రమంలోనే సూపర్ ఓవర్ లైనప్‌ను జట్టుగా నిర్ణయించాం. కానీ ఎవర్నీ ఆడించాలనే తుది నిర్ణయం మాత్రం నేను తీసుకున్నా. ఇదో అద్భుతమైన క్రికెట్ మ్యాచ్. ఈ ఓటమితో ఎంతో విలువైన పాఠాన్ని నేర్చుకున్నాం. ఈ ఓటమికి పూర్తి బాధ్యత నాదే. జట్టులో సీనియర్ ఆటగాడిగా నేను ఈ మ్యాచ్‌ను ముగించాల్సింది. ఈ టోర్నీలో ఎన్నో విషయాలను నేర్చుకున్నాం. ఈ కుర్రాళ్లు ఏదో ఒక రోజు భారత్‌కు ప్రపంచకప్ అందిస్తారు. ప్రతిభ విషయంలో మా కుర్రాళ్లు ఆకాశాన్ని తాకుతున్నారు. ఈ టోర్నీ వారికి నేర్చుకోవడానికి, అనుభవాన్ని గడించడానికి ఉపయోగపడింది.'అని జితేష్ శర్మ చెప్పుకొచ్చాడు.



## మా ఆశలను చిదిమేశాడు

ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ విధ్వంసకర బ్యాటింగ్‌తోనే యాషెస్ సిరీస్‌లో శుభారంభం అందుకోలేకపోయామని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తెలిపాడు. ఈ మ్యాచ్ పూర్తిగా తమ నియంత్రణలో ఉందని భావించామని, కానీ ట్రావిస్ హెడ్ తనదైన బ్యాటింగ్‌తో తమ విజయవకాశాలను లాగేసుకున్నాడని చెప్పాడు. పెర్త్ వేదికగా శనివారం ముగిసిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. బౌలర్లు ఆధిపత్యం చెలాయించడంతో రెండు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్(83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123) విధ్వంసకర శతకంతో చెలరేగాడు. టీ20 తరహా బ్యాటింగ్‌తో హోరాహోరీ తప్పదని భావించిన మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించాడు. ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన బెన్ స్టోక్స్.. ట్రావిస్ హెడ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'ఈ పరాజయంతో షాక్‌కు గురయ్యాను. ట్రావిస్ హెడ్ అద్భుతమైన ప్రదర్శన కనబర్చాడు. దూకుడుగా ఆడాడు. ఇది ఓ గొప్ప ఇన్నింగ్స్. ఆసీస్ ఆటగాళ్లు చాలా ధైర్యంగా ఆడి.. మ్యాచ్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. క్రీజులో సెట్ అయితే భారీ ఇన్నింగ్స్ ఆడేందుకు ప్రయత్నించాలి. ట్రావిస్ హెడ్ తన విధ్వంసంతో మా ఆశలను చిదిమేశాడు. ఈ పిచ్‌పై రిస్క్ తీసుకొని ఆడినవారికే ఆశించిన ఫలితం దక్కింది. ముఖ్యంగా బౌలర్లపై ఒత్తిడి తెచ్చినవారే పరుగులు చేయగలిగారు. ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసేందుకు మేం మూడు, నాలుగు ప్రణాళికలను ప్రయత్నించాం. కానీ అతను ఓ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోయాడు. అతన్ని ఆపడం చాలా కష్టమైంది. ఈ మ్యాచ్‌లో ఓడినా తొలి ఇన్నింగ్స్‌లో మేం బౌలింగ్ చేసిన విధానం అద్భుతంగా ఉంది. తొలి రోజు ఆటలో చాలా జరిగింది. బౌలర్లకు కలిసొచ్చింది. ఈ మ్యాచ్ పూర్తిగా మా నియంత్రణలోనే ఉందని భావించాను. కానీ అనూహ్య పరాజయం ఎదురైంది. ఈ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నా. మాకు ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఉన్నాయి. తదుపరి మ్యాచ్‌కు చాలా సమయం ఉంది. ఆ మ్యాచ్ గెలిచేందుకు శ్రమిస్తాం.'అని బెన్ స్టోక్స్ చెప్పుకొచ్చాడు. 205 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. ట్రావిస్ హెడ్(83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123) విధ్వంసకర శతకంతో 28.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేయగా.. ఆసీస్ 132 పరుగులకు ఆలౌటైంది. 40 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 164 పరుగులకు ఆలౌటైంది. దాంతో ఆసీస్ ముందు 205 పరుగుల లక్ష్యం నమోదైంది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న ఈ వికెట్‌పై ఈ లక్ష్యాన్ని ఛేదించడం ఆసీస్‌కు కష్టమవుతుందని అంతా అనుకున్నారు. కానీ ట్రావిస్ హెడ్ ఓపెనర్‌గా బరిలోకి దిగి టీ20 బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించాడు.



## తిప్పేసిన కుల్దీప్

### సౌతాఫ్రికా 247/6 ముగిసిన తొలి రోజు ఆట

భారత్‌తో రెండో టెస్ట్‌ను సౌతాఫ్రికా మెరుగ్గా ఆరంభించింది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై ఓపికగా ఆడిన సౌతాఫ్రికా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 81.5 ఓవర్లలో 6 వికెట్లకు 247 పరుగులు చేసింది. ట్రిస్టన్ స్టబ్స్(112 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 49), టెంబా బవుమా(92 బంతుల్లో 5 ఫోర్లతో 41) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. ఓపెనర్లు ఎయిడెన్ మార్క్‌రమ్(81 బంతుల్లో 5 ఫోర్లతో 38), ర్యాన్ రికెల్టన్(82 బంతుల్లో 5 ఫోర్లతో 35) అద్భుతమైన ఆరంభం అందించారు. సౌతాఫ్రికా బ్యాటర్ల అద్భుత ప్రదర్శనతో తొలి రెండు సెషన్లలో సౌతాఫ్రికా పూర్తి ఆధిపత్యం చెలాయించగా.. కుల్దీప్ యాదవ్(3/48) గేమ్ ఛేంజ్ బౌలింగ్‌తో ఆఖరి సెషన్‌లో భారత్ పైచేయి సాధించింది. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసారు. వెలుతురు లేమి కారణంగా మరో 8.1 ఓవర్ల ఆట మిగిలి ఉండగానే అంపైర్లు ఆటను నిలిపేసారు. రెండో రోజు ఆట ఆరంభంలో వీలైనంత త్వరగా సౌతాఫ్రికాను ఆలౌట్ చేసి భారీ స్కోర్ సాధిస్తేనే ఈ మ్యాచ్‌పై భారత పట్టు సాధిస్తుంది. లేదంటే తొలి టెస్ట్ తరహాలోనే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు మార్క్‌రమ్, ర్యాన్ రికెల్టన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. అయితే బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో 4 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద మార్క్‌రమ్ ఇచ్చిన సునాయస స్లిప్ క్యాచ్‌ను కేఎల్ రాహుల్ నేలపాలు చేశాడు. ఈ అవకాశాన్ని అతను సద్వినియోగం చేసుకున్నాడు. మరో రెండు రనౌట్ అవకాశాలను కూడా భారత్ చేజార్చుకుంది. ఇక టీ బ్రేక్‌కు ముందు మార్క్‌రమ్‌ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో సౌతాఫ్రికా 82/1 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ర్యాన్ రికెల్టన్‌ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో ట్రిస్టన్ స్టబ్స్, టెంబా బవుమా జట్టును ఆదుకున్నారు. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించిన ఈ జోడీ.. ఓపికగా ఆడుతూ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. దాంతో సౌతాఫ్రికా 156/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో భారత బౌలర్లు చెలరేగారు. 84 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన బవుమా-స్టబ్స్ జోడీని జడేజా విడదీసాడు. హాఫ్ సెంచరీకి చేరువైన బవుమాను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే స్టబ్స్‌ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్ చేసి హాఫ్ సెంచరీ చేయకుండా అడ్డుకున్నాడు. టోనీ డీ జోర్జీ, వియాన్ మల్డర్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేయగా.. కుల్దీప్ యాదవ్ మరోసారి అడ్డుకున్నాడు. మల్డర్(13)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. కొత్త బంతిని అందుకున్న తర్వాత టోర్నీ డీ జోర్జి(26)ని సిరాజ్ కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. ఆ తర్వాత నాలుగు బంతులకే బ్యాడ్ లైట్ కారణంగా ఆట ఆగిపోయింది.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 23-11-2025 | www.evarthalu.com



# దశదిశ లేని కమలం

రాజకీయాల్లో ఏ ఒక్క ఘటనా శాశ్వతం కాదు, ఏ ఒక్క విజయమూ అంతిమం కాదు. కానీ, కొన్ని సందర్భాల్లో ఒక పార్టీ తీసుకున్న నిర్ణయాలు, అనుసరించిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు ఆ పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తాయి. ప్రస్తుతం తెలంగాణలో బీజేపీ పరిస్థితిని గమనిస్తే సరిగ్గా ఇదే అనిపిస్తోంది. ఒకప్పుడు అధికారమే లక్ష్యంగా, దక్షిణ భారతానికి ముఖద్వారంగా తెలంగాణను భావించిన బీజేపీ, నేడు ఆ లక్ష్యానికి ఆమడ దూరంలో నిలిచిపోవడమే కాకుండా, తిరిగి కోలుకోలేని స్థితికి జారుకుంటోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడం, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో కొన్ని సీట్లు గెలిచినా క్షేత్రస్థాయిలో పట్టు సాధించలేకపోవడం, అంతర్గత కుమ్ములాటలు వెరసి.. తెలంగాణలో కమలం వాడిపోతోందన్న వాదనకు బలం చేకూరుస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం వరకు తెలంగాణలో బీజేపీ అంటే ఒక ప్రత్యామ్నాయ శక్తిగా కనిపించింది. దుబ్బాక ఉప ఎన్నిక విజయం, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో అనూహ్యమైన సీట్ల పెరుగుదల, హుజూరాబాద్ గెలుపు.. ఇవన్నీ చూసి బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయం అని ఆ పార్టీ అధిష్టానంతో పాటు రాజకీయ పరిశీలకులు కూడా భావించారు. కానీ, ఆ విజయాలన్నీ అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకత వల్ల వచ్చినవే తప్ప, బీజేపీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై ప్రజలు వేసిన ఓట్లు కాదన్న సత్యాన్ని ఆ పార్టీ గ్రహించలేకపోయింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది, బీఆర్ఎస్ ప్రతిపక్షంలో బలంగా పోరాడుతోంది. ఈ రెండు బలమైన ప్రాంతీయ, జాతీయ పార్టీల మధ్య బీజేపీ ఇమడలేక సతమతమవుతోంది.

## నాయకత్వ లేమి

ఏ పార్టీకైనా నాయకత్వం అనేది వెన్నెముక లాంటిది. కానీ తెలంగాణ బీజేపీలో అదే అతిపెద్ద బలహీనతగా మారింది. రాష్ట్ర అధ్యక్షుల మార్పు, సీనియర్లకు, కొత్తగా వచ్చిన వారికి మధ్య సమన్వయం లేకపోవడం ఆ పార్టీని అంతర్గతంగా దెబ్బతీసింది. బండి సంజయ్ హయాంలో ఉన్న దూకుడు, కిషన్ రెడ్డి నాయకత్వంలో, ఆ తర్వాత వచ్చిన రాంచందర్‌రావు నాయకత్వంలో కనిపించడం లేదన్నది క్యాడర్ మాట. ఇతర పార్టీల నుండి (ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నుండి) వచ్చిన నాయకులకు, పార్టీని నమ్ముకోవడంతో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్యకర్తలకు మధ్య అగాధం ఏర్పడింది. 'ఒరిజినల్ బీజేపీ' వర్సెస్ 'వలస బీజేపీ' అనే పోరు నడుస్తోంది. సిద్ధాంతపరమైన నిబద్ధత లేని నాయకులు పార్టీలో చేరడం, పదవుల కోసం పాకులాడటం వల్ల సామాన్య కార్యకర్తలో నైరాశ్యం గూడుకట్టుకుంది. ఇక, ఇప్పటికీ బీజేపీకి రాష్ట్రంలో అందరికీ ఆమోదయోగ్యమైన, మాస్ ఇమేజ్ ఉన్న ముఖ్యమంత్రి అభ్యర్థి లేరు. స్పష్టమైన నాయకత్వం లేని సైన్యం యుద్ధం గెలవలేదన్నది చారిత్రక సత్యం.

## క్షేత్రస్థాయి నిర్మాణం లేకపోవడం

సోషల్ మీడియాలో హల్చల్ చేయడం వేరు, పోలింగ్ బూత్ స్థాయిలో ఓట్లు వేయించుకోవడం వేరు. బీజేపీకి తెలంగాణలో బలమైన సోషల్ మీడియా వింగ్ ఉంది కానీ, ప్రతి గ్రామంలోనూ, ప్రతి బూత్ లోనూ పటిష్టమైన కమిటీలు లేవు. గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ వంటి కొన్ని పట్టణ ప్రాంతాలకు మాత్రమే బీజేపీ పరిమితమైంది. గ్రామీణ తెలంగాణలో, ముఖ్యంగా దక్షిణ తెలంగాణ, ఖమ్మం, నల్లగొండ వంటి జిల్లాల్లో ఆ పార్టీకి కనీసం డిపాజిట్లు దక్కే పరిస్థితి కూడా లేదు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకుండా, కేవలం గాలివాటు విజయాలపై ఆధారపడటం వల్లే బీజేపీకి ఈ దుస్థితి దాపురించింది. ఇప్పుడు నిర్మాణం చేపడదామన్నా సమయం మించిపోయింది. ఎందుకంటే, గ్రామాల్లో యువత, రైతులు కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్‌వైపు స్థిరపడిపోయారు. కొత్తగా బీజేపీలోకి వెళ్లేందుకు ఎవరికీ ఆసక్తి లేదు.

## కేంద్రం వైఖరి కూడా కారణం

తెలంగాణ ప్రజలు సెంటిమెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటుతున్నా, విభజన చట్టంలోని హామీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేర్చకపోవడం ఆ పార్టీకి పెద్ద మచ్చగా మారింది. తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. 'డబుల్ ఇంజిన్ సర్కార్' వస్తే అభివృద్ధి జరుగుతుందని బీజేపీ చెబుతున్నా, పక్కనే ఉన్న కర్ణాటకలోనో, గతంలో డబుల్ ఇంజిన్ ఉన్న ఇతర రాష్ట్రాల్లోనో అద్భుతాలేమీ జరగకపోవడంతో ప్రజలు ఆ నినాదాన్ని నమ్మడం మానేశారు.



## మతానికి తెలంగాణ భిన్నం

తెలంగాణ సమాజం గంగా-జమునా తహజీబ్‌కు ప్రతీక. ఇక్కడి గ్రామీణ ప్రాంతాల్లో హిందూ-ముస్లింల మధ్య సామరస్యపూర్వక వాతావరణం ఉంది. బీజేపీ అనుసరించే కరుడుగట్టిన హిందుత్వ ఎజెండా ఉత్తరాది రాష్ట్రాల్లో పనిచేస్తుందేమో కానీ, తెలంగాణ సామాజిక పరిస్థితులకు అది పూర్తిగా సరిపోదు. కేవలం మతపరమైన ధ్రువీకరణ ద్వారా ఓట్లు దండుకోవాలని చూడటం తెలంగాణలో వికటించింది. హైదరాబాద్ పాతబస్తీకి పరిమితమైన ఎంఐఎం పార్టీని భూతద్దంలో చూపిస్తూ, రాష్ట్రం మొత్తం మీద భయాన్ని సృష్టించి ఓట్లు పొందాలనుకున్న వ్యూహం పాతబడిపోయింది. ప్రజలు అభివృద్ధిని, సంక్షేమాన్ని, ఉపాధిని కోరుకుంటున్నారు తప్ప, నిత్యం మతపరమైన ఘర్షణలను కాదు. ఈ విషయాన్ని గ్రహించడంలో బీజేపీ ఘోరంగా విఫలమైంది.

## కాంగ్రెస్ పుంజుకోవడం - బీఆర్ఎస్ స్థిరత్వం

ఒకప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయింది, ఇక బీజేపీనే ప్రత్యామ్నాయం అనుకునేవారు. కానీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుని అధికారంలోకి రావడం బీజేపీ ఆశలపై నీళ్లు చల్లింది. ఇప్పుడు కాంగ్రెస్ బలంగా ఉంది. మరోవైపు, అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్, సంస్థాగత నిర్మాణం ఉంది. కేసీఆర్ వ్యూహచతురతను తక్కువ అంచనా వేయలేం. ఈ త్రికోణ పోటీలో బీజేపీ మూడో స్థానానికే పరిమితం కాక తప్పదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ జాగ్రత్త పడుతుంటే, బీజేపీకి కొత్తగా ఓటు వేసే వర్గం ఏదీ కనిపించడం లేదు. దళితులు, మైనారిటీలు, రెడ్లు కాంగ్రెస్ వైపు, బీసీల్లోని కొన్ని వర్గాలు, వెలమలు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పుడు, బీజేపీకి మిగిలిన ఓటు బ్యాంక్ ఏది? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

## ఏముంది ఎజెండా?

బీజేపీకి రాష్ట్రానికి సంబంధించిన స్పష్టమైన ఎజెండా లేదు. కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీలు' అని, బీఆర్ఎస్ 'సంక్షేమ పథకాలు' అని ప్రజల్లోకి వెళ్లాయి. మరి బీజేపీ ఎజెండా ఏమిటి? కేవలం ప్రధాని మోదీ ఇమేజ్ ను చూపించి ఓట్లు అడగడం తప్ప, తెలంగాణకు తాము ఏం చేస్తామో స్పష్టంగా చెప్పలేకపోయారు. స్థానిక సమస్యలపై పోరాటం చేయడంలో విఫలమయ్యారు. ఆర్టీసీ సమ్మెలప్పుడు గానీ, నిరుద్యోగ సమస్యపై గానీ బీజేపీ చేసిన పోరాటాలు ప్రచార ఆర్భాటానికే తప్ప ఫలితాలను ఇవ్వలేదు. కర్ణాటకలో అధికారం కోల్పోవడం, తమిళనాడు, కేరళలో ఉనికి నామమాత్రమే కావడం, ఇప్పుడు తెలంగాణలోనూ చతికిలపడటంతో దక్షిణ భారతంలో బీజేపీ విస్తరణ వ్యూహం బెడిసికొట్టినట్టేనని చెప్పవచ్చు. 'దక్షిణాదికి ముఖద్వారం తెలంగాణ' అని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకున్నా, ఆ ద్వారం ఇప్పుడు మూసుకుపోయింది. ఉత్తరాది పార్టీ అనే ముద్రను చెరిపివేసుకోవడంలో బీజేపీ విఫలమైంది. భాషా పరమైన, సాంస్కృతిక పరమైన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుందన్న భయం దక్షిణాది ప్రజల్లో ఉంది. దీనిని పోగొట్టే ప్రయత్నం చేయకపోగా, హిందీని రుద్దడం వంటి చర్యల వల్ల ఆ దూరం ఇంకా పెరిగింది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. బీజేపీకి 2019 నుండి 2023 వరకు ఒక అద్భుతమైన అవకాశం దొరికింది. బీఆర్ఎస్ పై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్న సమయం అది. కాంగ్రెస్ బలహీనంగా ఉన్న సమయం అది. ఆ సమయంలో బీజేపీ క్షేత్రస్థాయిలో పార్టీని నిర్మించుకుని, విశ్వసనీయమైన నాయకత్వాన్ని అందించి ఉంటే ఫలితం వేరుగా ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని బీజేపీ చేజార్చుకుంది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి బలంగా ఉంది. బీఆర్ఎస్ తన తప్పులను సరిదిద్దుకుని మళ్లీ ప్రజల్లోకి వెళ్తోంది. ఈ పరిస్థితుల్లో బీజేపీ మళ్లీ పుంజుకోవడం అంటే అసాధ్యమే. ఆ పార్టీకి ఇక మిగిలింది కేవలం కొన్ని నియోజకవర్గాల్లో ప్రభావం చూపగలగడం. రాష్ట్రవ్యాప్తంగా అధికారం చేపట్టే స్థాయికి ఎదగడం ఇప్పట్లో కలే. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గానీ, భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో గానీ బీజేపీ ప్రభావం నామమాత్రంగానే ఉండబోతోంది. అంతర్గత కుమ్ములాటలు, సిద్ధాంతపరమైన వైరుధ్యాలు, ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేకపోవడం ఆ పార్టీని పతనం అంచున నిలబెట్టాయి. తెలంగాణ రాజకీయ యవనికపై 'కమలం' వికసించే అవకాశం మృగ్యమైపోయిందనే చెప్పాలి. చరిత్రలో ఒకప్పుడు బలమైన శక్తిగా ఎదిగి, స్వయంకృతాపరాధాలతో పతనమైన పార్టీల జాబితాలో తెలంగాణ బీజేపీ కూడా చేరబోతోందన్నది కఠినమైన వాస్తవం.

**-కాసుగంటి వేంకటేశ్వరరావు**
రాజకీయ విశ్లేషకుడు

# క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



'ఏకత మరియు క్రమశిక్షణ' నినాదంతో దేశ యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో 'నేషనల్ క్యాడెట్ కార్ప్స్' పోషిస్తున్న పాత్ర ఎంతో విశిష్టమైనది. ప్రతి సంవత్సరం నవంబర్ నెలలోని నాల్గవ ఆదివారాన్ని 'ఎన్‌సీసీ డే'గా మనం ఘనంగా జరుపుకుంటాం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, దేశ రక్షణలో యువత పాత్ర ఉండాలనే ఉద్దేశంతో పండిట్ హెచ్.ఎన్. కుంజ్రూ నేతృత్వంలోని కమిటీ సిఫార్సుల మేరకు 1948లో ఎన్‌సీసీని ఏర్పాటు చేశారు. 1948లో కేవలం 20,000 మంది క్యాడెట్లతో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫాం ధరించిన యువజన సంస్థగా ఎదిగింది. ఆర్మీ, నేవీ, మరియు ఎయిర్ ఫోర్స్ అనే మూడు విభాగాలుగా ఇది విస్తరించి ఉంది. ఎన్‌సీసీ కేవలం సైనిక శిక్షణ మాత్రమే కాదు, అది ఒక జీవన విధానం. ఇది విద్యార్థులలో నైతిక విలువలు, నిజాయితీని పెంపొందిస్తుంది. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యాన్ని, ముందుండి నడిపించే నాయకత్వ పటిమను నేర్పిస్తుంది. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరూ భారతీయులే అనే భావనను కలిగిస్తుంది. స్వార్థం లేకుండా దేశానికి, సమాజానికి సేవ చేయడాన్నినేర్పిస్తుంది. ఎన్‌సీసీ క్యాడెట్లను రెండవ రక్షణ శ్రేణిగా పిలుస్తారు. వీళ్లు వరదలు, భూకంపాలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు సహాయక చర్యల్లో ముందుంటారు. రక్తదాన శిబిరాలు, వృక్షారోపణ, స్వచ్ఛ భారత్, పల్స్ పోలియో వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సమాజంలో చైతన్యం తెస్తారు. అవసరమైనప్పుడు ట్రాఫిక్ నియంత్రణ, ఆసుపత్రుల్లో సేవలు అందించడం, రక్షణ దళాలకు మద్దతుగా నిలవడం వీరి విధి. అందుకే.. కేంద్రం వీరిని ప్రత్యేక కేటగిరీగా గుర్తించింది. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు రక్షణ రంగంలో, పోలీసు ఉద్యోగాల్లో, పారా మిలిటరీ దళాల్లో చేరడానికి ప్రత్యేక రిజర్వేషన్లు మరియు ప్రాధాన్యం ఉంటుంది. సీ సర్టిఫికెట్ కలిగిన వారికి ఆర్మీలో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలకు రాత పరీక్ష నుండి మినహాయింపు వంటి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి.

**-సతీశ్ చంద్ర, సైనికుడు, రాష్ట్రీయ రైఫిల్స్**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.